వీక్షణం
Veekshanam
ఆర్థిక, సామాజిక పక్షపత్రిక
సంపుటి: 1 సంచిక: 10
సమతా పబ్లికేషన్స్ ప్రచురణ
ఏప్రిల్ 1-15, 2004

లోపలి పేజీల్లో...

విడి ప్రతి : రూ॥ 6/-
వార్షిక చందా : రూ॥140/-లు

సంపాదకీయం:

పార్లమెంటు రాజకీయాల అసలు రూపు - విధ్వంసం, అవినీతి

ఈసారి ఎన్నికలలో రెండు అంశాలు కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. మొదటిది, పార్లమెంటరీ పార్టీల ప్రవర్తనలో అత్యంత సులభంగా కలిసిపోయిన విధ్వంస నేరప్రవృత్తి. ఒక్కొక్క సీటుకు ఎంతమంది ఆశించే అభ్యర్థులున్నా అంతిమంగా టిక్కెట్ దొరికేది ఒక్కరికే కనుక మిగిలిన వారందరు తమ అసంతృప్తిని తమ తమ పార్టీ కార్యాలయాల మీద, ప్రభుత్వ ఆస్తుల మీద చూపించి విధ్వంసకాండ సాగించవచ్చునని ఈ ఎన్నికలు చూపించాయి. నిజానికి రాష్ట్రంలో విధ్వంసకారులుగా ముద్రపడిన నక్సలైట్లకన్నా ఎక్కువ విధ్వంసం నామినేషన్ల ముందూ వెనుకా విధ్వంస వ్యతిరేకులమని చెప్పకునే పార్లమెంటరీ పార్టీలు చేశాయి.

ఇంతకన్నా ముఖ్యమైన విషయం పార్లమెంటరీ రాజకీయాలు సంపన్నులకు మాత్రమే అని ఈ ఎన్నికలు రుజువు చేస్తున్నాయి. చట్టప్రకారం తమ ఆస్తిపాస్తులు ప్రకటించవలసిన అభ్యర్థులు అధికారులకు సమర్పించిన లెక్కలు ఒక్కసారి చూడండి. శాసనసభకు పోటీచేస్తున్న అభ్యర్థుల కనీస ఆస్తులు కొన్ని పదుల లక్షలు, గరిష్ఠం కొన్ని పదులకోట్లు. ఈ అంకెల్లో వాస్తవం చాలా తక్కువని, ప్రకటించిన ఆస్తికి కనీసం పదుల రెట్లు ఆస్తి ఆయా అభ్యర్థులకుందని స్థానిక ప్రజలను ఎవరిని అడిగినా బయటపడుతుంది. కాని వాళ్లు చెప్పే అంకెలు సరైనవే అనుకున్నప్పటికి అంత ఆస్తి లేకపోతే ఎన్నికల రాజకీయాల్లో మనుగడ సాధ్యం కాదని చెప్పకనే చెప్పినట్టవుతుంది.

ఇంకా విచిత్రమైన విషయమేమంటే నిజమైనదో, అబద్ధమైనదో, విపరీతంగా తగ్గించి చూపినదో ఒక ఆస్తి అంకెను ఆయా అభ్యర్థులు చూపినపుడు అధికారులుగాని, పత్రికలుగాని ఆ ఆస్తి అయినా ఎలా వచ్చిందని అడగకపోవడం. మామూలుగా ఆదాయపు పన్ను శాఖ హేతుబద్ధమైన వనరుల ద్వారా పొందే ఆదాయం ఎంత అని లెక్కించి అంతకన్నా ఎక్కువ ఆస్తులుంటే నేరంగా నమోదు చేస్తుంది. అటువంటి అవినీతి కేసుల గురించి దాదాపు రోజూ పత్రికల్లో వార్తలు వస్తుంటాయి. చిరుద్యోగుల మీద ఉపయోగించే ఈ అస్త్రాన్ని ఎన్నికల అభ్యర్థుల మీద ఎందుకు ఉపయోగించడం లేదో తెలియదు. ఉదాహరణకు ఒక ముఖ్యమంత్రికి లేదా ఒక మంత్రికి ఎన్ని అదనపు వసతులు, సౌకర్యాలు ఉన్నా నెలజీతం ఇరవై, ఇరవై ఐదు వేలకు మించదు. హేతుబద్ధమైన వనరుగా చెప్పదగిన ఆ ఆదాయం మొత్తానికి మొత్తం పోగు చేయగలరనుకున్నా సంవత్సరానికి కూడబెట్టగల్గిన ఆస్తి రెండు మూడు లక్షలకు మించదు. మరి తొమ్మిది సంవత్సరాలపాటు మంత్రిగా ఉన్న వ్యక్తికి కోట్లాది రూపాయల ఆస్తి వాళ్లు చెప్పిన ప్రకారం ఎట్లా పోగుపడిందని ప్రశ్నించిన వాళ్లు లేరు. అది అవినీతి సంపాదన కావడానికే ఎక్కువ ఆస్కారం ఉంది గాని న్యాయమైన సంపాదన కావడానికి అవకాశం లేదు. అసలు ఏ ఎమ్‌ఎల్‌ఏ అయినా, మంత్రి అయినా రాజకీయ జీవితం ప్రారంభించిన రోజు ఆస్తి ఎంత, తరువాత ఐదేళ్లకో పదేళ్లకో ఆస్తి ఎంత? అని లెక్కవేస్తే పార్లమెంటరీ రాజకీయాలు ఎట్లా లాభసాటి వ్యాపారం అయిపోయాయో బయటపడుతుంది. అది అంతటి లాభసాటి వ్యాపారం అయింది గనుకనే, వందల శాతాలు, వేలశాతం లాభాలు ఉన్నాయంటే ప్రజల అమాయకత్వమే పెట్టుబడిగా ఇబ్బడి ముబ్బడి ఫలితం సాధించవచ్చు గనుకనే, సీట్లకోసం అంత తగాదా జరిగింది. ఆ తగాదాలే ఆ విధ్వంసమే అభ్యర్థుల ఆస్తుల ప్రకటనలే ఈ దేశంలో పార్లమెంటరీ రాజకీయాలు తమ ప్రజాసేవ సారాన్ని కోల్పోయామని మరొకసారి మరింత బలంగా ప్రకటిస్తున్నాయి.

O

ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ముఖ్య పంటల వార్షిక టోకు ధరలు

(క్వింటాలుకు రూ॥లు)

ఎండు మిరపకాయలు

సంవత్సరం	సగటు ధర	మాసపు సగటు కనిష్ట ధర	మాసపు సగటు గరిష్ట ధర	కనిష్ట ధరకు అమ్మిన రైతులు కోల్పోయిన ఆదాయం	శాతం
1	2	3	4	5	6
1999-00	3534.20	3076.60	3954.76	878.16	28.5
2000-01	2941.94	2729.90	3168.70	438.80	16.1
2001-02	2895.25	2643.52	3172.68	529.16	20.1
2002-03	3327.68	2787.50	4077.68	1289.58	46.1
4-12/2003	-	3622.44	4217.00	594.56	16.4
1/2004	4220.00	-			
3-3-04న	2770.00 (వండర్ హాట్)	1900.00			
(వరంగల్లు మార్కెట్)	1800.00 (గుంటూరు) (మోడల్ ధరలు)	1400.00			

పసుపు

సంవత్సరం	సగటు ధర	కనిష్ట ధర	గరిష్ట ధర	కోల్పోయిన ఆదాయం	శాతం
1999-00	2777.38	1554.17	3500.00	945.83	25.2
2000-01	1523.87	1350.00	2033.33	683.33	50.6
2001-02	1399.35	1200.00	1676.67	1023.33	39.7
2002-03	2326.84	2122.50	2762.50	1360.00	30.2
4-12/2003	-	2513.00	2920.00	407.00	16.2
1/2004	2950.00	-	-		
3-3-04న	2565.00(గోలా)	2280.00	2600.00		
(గుంటూరు	2211.00(కొమ్ము)	2016.00	2525.00		
మార్కెట్)	(మోడల్ ధరలు)				

ప్రత్తి

సంవత్సరం	సగటు ధర	కనిష్ట ధర	గరిష్ట ధర	కోల్పోయిన ఆదాయం	శాతం
1999-00	1732.20	1486.33	2006.25	520.20	35.0
2000-01	1852.83	1583.33	1977.00	393.67	24.9
2001-02	1805.25	1615.00	1959.67	1419.33	21.3
2002-03	1872.65	1510.50	2187.99	677.19	44.9
4-12/2003	-	2050.33	2550.00	499.67	24.4
3-3-2004న	2700.00	-	-	-	-
(వరంగల్లు మార్కెట్)	2700.00 (ఆర్‌సిహెచ్2) (మోడల్ ధర)	-	-	-	-

ఈ అసమ్మతి తిరుగుబాట్లు దేనికి సూచన?

- స్ఫూర్తి

దేశ రాజకీయ వ్యవస్థలో పరస్పరం భిన్నమైన రెండు ధోరణులు రోజురోజుకు తీవ్రతరమౌతున్నట్లు కనబడుతుంది. అందులో ఒకటి రాజకీయ వ్యవస్థకు ప్రజాస్వామ్య స్వభావాన్ని వ్యక్తీకరించగల మొట్టమొదటి అతి ప్రధాన ప్రమాణమైన ఎన్నికలపట్ల, అందులోనూ కీలకమైన ఓటింగ్ సరళిపట్ల మేధావులతో సహా మధ్యతరగతి, కిందిస్థాయి ప్రజల్లో ఆసక్తి క్షీణిస్తుంది. స్పష్టంగా చెప్పాలంటే రాజకీయాలంటే, ఎన్నికలంటే అసహ్యించుకునే ధోరణి ఈ వర్గాల్లో ఎన్నిక, ఎన్నికకు, ఎప్పటికప్పుడు పెరుగుతున్నట్లు కనబడుతున్నది. ఎటుచూస్తే అటు సాధ్యా-అసాధ్యాలు, అవసర-అనవసరాల ప్రాధాన్యతలతో ఎంతమాత్రం నిమిత్తం లేని అభ్యర్థుల అబద్దాలతో కూడిన నిరంతర ప్రచారహోరును భరించలేకో, విచ్చలవిడిగా డబ్బు, మద్యంలాంటి వాటిని పంపిణీ చేస్తూ ఓటర్లను ప్రలోభపెట్టడం ద్వారానో, తప్పనిసరిగా తీరాల్సిన కనీసావసరాలను కనీసపు స్థాయిలోనైనా తీర్చుకోలేకపోతున్న ప్రజల దయనీయ స్థితిని అవకాశంగా తీసుకుని, వారికి అరచేతి వైకుంఠాన్ని చూపడం ద్వారానో, ఎదుటి పక్షానికి చెందిన పోలింగ్ ఏజెంట్లకు ధనాశ చూపి కొనేయడం వల్లనో, లేదా కండబలంతో బెదిరించడం వల్లనో జరిపించుకుంటున్న రిగ్గింగ్ తదితర అప్రజాస్వామిక విధానాలను అవలంబిస్తే తప్ప, పోలింగ్ శాతాన్ని 55 శాతానికి పైగా దాటించలేకపోతున్నారు. ఇలా అప్రజాస్వామిక విధానాలనవలంబిస్తూ సమత, మమత, శాంతి, సౌభ్రాతృత్వం, సౌభాగ్యాలతో కూడిన సత్పాలనను అందించే పాలకుల ఎంపికలో పౌరుడు తన నిష్పాక్షిక అభిప్రాయాలను ఓటురూపంలో వెల్లడించగల అవకాశాన్ని రాజకీయ పార్టీలు హైజాక్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్వేచ్ఛగా విచక్షణ-విజ్ఞతలను ప్రదర్శించడం ద్వారా ఓటుహక్కును వినియోగించుకుంటున్న శాతం ఏ 20కి మించి ఉండదనడంలో అబద్ధం ఏదీ లేదనుకుంటే ఎన్నికల పట్ల, రాజకీయాల పట్ల ప్రజల్లో ఆసక్తి ఏ స్థాయికి క్షీణించిందో అర్థం చేసుకోవచ్చు.

రెండవ అంశం, రాజకీయాల్లో ప్రధాన ప్రత్యక్ష పాత్రదారులైన ప్రతినిధులకు అధికార రాజకీయాల పట్ల, అలాంటి రాజకీయాలకు కీలకమైన ఎన్నికల పట్ల మక్కువ పెరుగుతున్నట్లు స్పష్టమౌతుంది. ఒక ఎన్నికకు మరొక ఎన్నికకు ప్రచారపు ఖర్చు, హింస, ఫిరాయింపులు, విధ్వంసాలు లాంటి అంశాలను పోల్చి చూసినట్లైతే నేతలకు ఎన్నికలపట్ల, రాజకీయాల పట్ల అనేక రెట్ల ఆసక్తి పెరిగిపోతున్నట్లు తెలుస్తుంది. అది ఈ ఎన్నికల్లో పరాకాష్టకు చేరినట్లు అసమ్మతి ఆగ్రహం పేరుతో అభ్యర్థుల అభిమానులు కొనసాగిస్తున్న వికారపు చేష్టలు, విధ్వంసకాండలు రుజువు చేస్తున్నాయి. నిన్నటి దాక తాము ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానంలో పోటీ చేసేందుకు తనకు బదులుగా మరో అభ్యర్థిని అధిష్టానం నిర్ణయిస్తున్న సందర్భంలో, లేదా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాన్ని విపక్షాన్ని ఓడించేందుకు కుదుర్చుకున్న పొత్తుల్లో భాగంగా తమ పార్టీ మిత్రపక్షానికి కేటాయించిన సందర్భంలో వెల్లువెత్తుతున్న వీళ్ల ఈ వీరంగపు వికృత చేష్టలు ప్రజల్లో రాజకీయ ప్రతినిధులన్నా, వారు నిర్వహిస్తున్న రాజకీయాలన్నా, రోత పుట్టిస్తున్నాయి.

> ఎన్నికల్లో పోటీ చేయడమే రాజకీయమన్నట్లుగా అర్థాన్ని మారుస్తున్న వాళ్ల టికెట్టు రానంతమాత్రాన జారుడుబండపై జారినంత సులువుగా ఎదుటి పార్టీలోకి చేరిపోతున్నారు. ఒంటిమీద గుడ్డలు మార్చినంత తప్పనిసరి అవసరం అన్నట్లు పార్టీలను, జెండాలను మార్చేస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడడం అంటే ఇదేనా? ప్రజల కోసం పని చేయడం అంటే పార్టీలు మార్చడమేనా?

తమ పార్టీది బడుగు బలహీనవర్గాల సంక్షేమ సిద్ధాంతమని, తమ నాయకుడు దీనజనోద్ధారకుడని, అభివృద్ధికోసం, ప్రగతికోసం అలుపెరగకుండా పనిచేస్తున్న అపర భగీరథుడని, తను పార్టీ సిద్ధాంతాల కోసం ప్రాణమివ్వడానికైనా సిద్ధమేనని, ఎన్నికల ముందు నీతులు పలికిన వాళ్లు, ఎన్నికల్లో టికెట్టు రానంత మాత్రాన పార్టీ కార్యాలయాలను తగులబెడుతున్నారు. పార్టీ పుట్టినప్పటి నుండి జెండా మోసి మోసి భుజాలు కాయలు కాసాయని (!) వాపోతున్న వీళ్లు, టికెట్ రాలేదని తేలిన మరుక్షణం, నిజంగా జెండాలు మోసిన కార్యకర్తల చేతనే జెండా గద్దెలు కూలగొట్టిస్తున్నారు! తను అమితంగా పూజించే ఇష్టదైవంకంటే మిన్నగా తన నాయకుని నిలువెత్తు చిత్రపటాన్ని తమ బంగళాల్లో అందరికీ కనబడేట్టుగా వేలాడదీసి, వారికి లేని లేని గొప్పలను, ఎక్కడా ఎవరికీ లేని సద్గుణాలను అంటగడుతూ నెత్తినెత్తుకుని 'హరిదాసు'మల్లె కీర్తిస్తూ ఊరేగిన వీళ్లు, తమకు టికెట్ కేటాయించకపోయేసరికి నాయకుల కటౌట్‌లను ముక్కచెక్కలు చేస్తూ చిందులేస్తున్నారు! చివరకు ఆత్మహత్యా నాటకాలాడుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడమే రాజకీయమన్నట్లుగా అర్థాన్ని మారుస్తున్న వాళ్ల టికెట్టు రానంతమాత్రాన జారుడుబండపై జారినంత సులువుగా ఎదుటి పార్టీలోకి చేరిపోతున్నారు. ఒంటిమీద గుడ్డలు మార్చినంత తప్పనిసరి అవసరం అన్నట్లు పార్టీలను, జెండాలను మార్చేస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడడం అంటే ఇదేనా? ప్రజల కోసం పని చేయడం అంటే పార్టీలు మార్చడమేనా? ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ రాకపోయేసరికి స్వపార్టీ అప్రజాస్వామిక పోకడలు, ప్రజావ్యతిరేక విధానాలు, డబ్బు రాజకీయాలు, ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతిలాంటి అనైతికత గూర్చి

తెగవాగుతున్న వీళ్లు, తమకు టికెట్ ఇవ్వజూపిన రాజకీయ పార్టీ సైతం ఇంతకు భిన్నమైందేమీ కాదన్న కనీసపు ఇంగిత జ్ఞానాన్ని సైతం వదిలేసి, ఆయా పార్టీల్లో నిఖార్సైన (అ) ప్రజాస్వామిక వెలుగుల్ని, (అ) ప్రజాహిత రాజకీయ నిబద్ధతను చూసి కీర్తిస్తూ తరించిపోతున్నారు! తమ పార్టీ ప్రభుత్వంలో ఉండగా వందలాది మంది రైతులతో సహా వివిధ సెక్షన్ల ప్రజానీకం తమ ఆస్తుల్ని, అవయవాల్ని, పిల్లలను అమ్ముకుంటూ చివరకు అప్పుల బాధలలో ఆత్మహత్యలు చేసుకుంటే రెండు కన్నీటి బొట్లైనా రాల్చని వాళ్లు, రెండోసారో, మూడోసారో (మొదటిసారి మాత్రమే కాదు) పోటీ చేసేందుకు టికెట్టు రానంత మాత్రాన కొంపలుమునిగినట్లు కన్నీళ్ళ పర్యంతమౌతున్నారు. తమ ఏలుబడిలో ప్రజాపక్ష రాజకీయ సంస్థలను అప్రజాస్వామికంగా నిషేధించి, పౌరహక్కులపై అప్రకటిత అణచివేత విధానాన్ని అవలంబిస్తూ, ప్రజా సమూహాలకు ఆయా నిషేధిత సంస్థలతో రాజకీయ సంబంధాలు అంటగడుతూ చిత్రహింసలు, అక్రమ కేసులతో పాటు అనేక సందర్భాల్లో జనజీవన స్రవంతిలో ఉన్న ఎంతోమంది యువతీ యువకులను ఎన్‌కౌంటర్ పేర హత్యలు చేస్తుంటే ఆ విధానం అరాచకమైనదని, అప్రజాస్వామికమని అనడానికి సాహసించని వాళ్లు, ఎన్నికల్లో టిక్కెట్ రాని పక్షంలో పార్టీకి రాజీనామా చేయడానికి సిగ్గుపడడంలేదు. తాము బలహీనవర్గానికి చెంది వుండి అధికారం నెరిపిన హయాంలో తాము బలపడ్డారేగాని బలహీన, బడుగు వర్గాలకు ఏ విధంగాను చేయూత నివ్వని వీళ్లు, తమకు టిక్కెట్ రానంతమాత్రాన బలహీన వర్గాలకు అన్యాయమై పోయిందని గొంతు చించుకుంటున్నారు! అయినా వీళ్ల దృష్టిలో బలహీనవర్గాలంటే కోట్ల విలువైన ఆస్తులు కలిగి సకల సౌకర్యాలతో తులతుగూతున్నవారే! తాము అధికారంలో ఉంటే మాత్రమే బలహీనుల బతుకుల్లో వెలుగులు ఉంటాయని, లేనట్లైతే బతుకంతా చీకట్లేనన్నట్లు భావిస్తున్న వీళ్ల ఆలోచనల్లో నిజాయితీ 'నేతిబీర' చందానికి సరిపోతుంది. ఈ ధోరణులన్నీ ఏం సూచిస్తున్నాయి?

ఇష్టా-అయిష్టాలు, విశ్వాస-అవిశ్వాసాల పునాదిపై తమ ఆశలు, ఆకాంక్షలు ప్రతిబింబిస్తూ ప్రజల సామాజిక-ఆర్థిక ప్రయోజనాలను నెరవేర్చే సమున్నత లక్ష్యం కలిగి ఉండాల్సిన రాజకీయాల్లో పౌరుల పాత్ర ఎన్నికల పర్వానికే పరిమితమైపోయింది. దీంతో ఎన్నికైన ప్రతినిధులు తదనంతర కాలంలో పాలనా విధానాలను ప్రజాసంక్షేమ లక్ష్యానికి బదులు తమ స్వప్రయోజనాలను సాధించుకునేదుకు రాజకీయాలను సాధనాలుగా మలుచుకుంటున్నారు. ఆ విధానాలను నిలువరించడానికి, నియంత్రించడానికి ప్రజలకు అధికారమే లేకపోవడంతో వారి అక్రమ సంపాదనకు అంతే లేకుండా పోతుంది. ఇది ఆందోళనకర విషయం.

స్వతంత్ర్యానంతరం ఎన్నికలు మొదలైన గత అయిదు దశాబ్దాలుగా అనేక స్థాయి ఎన్నికల్లో క్రమం తప్పకుండా పాల్గొంటున్న ప్రజల బతుకుల్లో అభివృద్ధి దిశగా ఆశించిన దాంట్లో రవ్వంత మార్పైనా రాలేదు సరికదా, ఆయా ఎన్నికల్లో పోటీచేసి అధికారాన్ని చవిచూస్తున్న అభ్యర్థులు మాత్రం ఆస్తులు, అంతస్థులతో అందనంత ఎత్తుకు ఎదిగి పోతున్నారు. గ్రామస్థాయిలో వార్డు మెంబరు మొదలు, భారత ప్రజాతంత్ర వ్యవస్థలో అత్యున్నత స్థాయి ప్రజాప్రతినిధి హోదా అయిన ప్రధానమంత్రి దాక ఏ ఒక్కదాంట్లోనైనా గెలిచినా చాలు, ఆయా స్థాయికి తగ్గట్లు సంతృప్తికరమైన సంపదను అక్రమ పద్ధతుల్లో అధికారికంగా పోగేసుకోవడానికి రాజకీయాలు చక్కని రాజమార్గాలై పోయాయి. మరోదఫా ఎన్నికల్లో పోటీ చేయడానికి సరిపోయినంతగా అంగ, అర్థబలం సమకూరినట్లే! రెండోసారి కూడా గెలిస్తే ఆ పార్టీలో ఆస్థానంపై ఆ కుటుంబానికి వంశపారంపర్య హక్కు లభించినట్లే! అధికారం అందుకోవడానికి, అందిన అధికారం నిలుపుకోవడానికి, ఎక్కడ వీలుపడితే అక్కడ, ఎంత వీలుపడితే అంత అక్రమ పద్ధతులను అవలంబించడానికి అభ్యర్థులెవరూ వెనకా ముందూ ఆలోచించడంలేదు. ఈ విధంగా ఎన్నికకు ముందూ, ఎన్నికైన తర్వాత ప్రజల దృష్టిలో అనహ్యానికి గురౌతామనో, పదిమందిలో పలుచనై పోతామనో, పరువు పోతుందనో కించిత్తు భయం కూడా లేకుండాపోయింది. అక్రమ సంపాదనకు పుష్కలమైన అవకాశాలతోపాటు, ఎన్నికల్లో గెలిచిన మరుక్షణం అన్యాపదేశంగా లభించే బంగళా, కారు, ప్రతిష్టకు చిహ్నంగా మారిపోయిన సాయుధ రక్షణ పహారా, తదితర అవకాశాలతో శ్రమ చేయకుండా విలాసవంతమైన జీవన విధానాన్ని గరపడమే రాజకీయాలకు అత్యుత్తమ అత్యున్నత లక్ష్యంగా మారిపోయింది. ఈ నేపథ్యం కొనసాగింపే రాజకీయ పార్టీలు ఎన్నికల్లో అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తున్న సందర్భంలో తమకో, తమ వారికో టికెట్ దక్కలేదన్న అసమ్మతి పోరాటం పేరుతో అభ్యర్థులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో జరిపిస్తున్న అభిమానుల కిష్కిందకాండకు కారణం. ఈ దేశంలో సంపదల రూపంలో క్షణక్షణం పోగుపడుతున్న కష్టజీవుల రక్తమాంసాలను అధికారికంగా అందినకాడికి పీక్కుతినాలని అభ్యర్థులు పడుతున్న ఆరాటానికి నిదర్శనమే ఈ అసమ్మతి ఆగ్రహ జ్వాలలు, పార్టీ రాజీనామాలు, ఫిరాయింపులు. టిక్కెట్టు దక్కించుకోవడానికి, దక్కిన టికెట్టుపై గెలుపును సాధించుకోవడానికి వీళ్లు పడుతున్న ఆరాటం, చేస్తున్న పోరాటంలో కనీసం పావలా వంతైనా ప్రజల సమస్యల పట్ల ప్రదర్శించి ఉంటే ఈ రోజు ప్రజల ఆర్థిక సామాజిక స్థితి ఇంత దుర్భరంగా ఉండేది కాదు. ఈ మొత్తం తతంగానికి ప్రజాసేవ పట్ల తపన, ఆరాటం, ఆత్మగౌరవానికి సంబంధించిన లక్ష్యాలుగాని, స్వభావంగాని ఉన్నట్లు భావించడం భ్రమ మాత్రమే కాదు, అవివేకం కూడా.

గ్రామస్థాయిలో వార్డు మెంబరు మొదలు, భారత ప్రజాతంత్ర వ్యవస్థలో అత్యున్నత స్థాయి ప్రజాప్రతినిధి హోదా అయిన ప్రధానమంత్రి దాక ఏ ఒక్కదాంట్లోనైనా గెలిచినా చాలు, ఆయా స్థాయికి తగ్గట్లు సంతృప్తికరమైన సంపదను అక్రమ పద్ధతుల్లో అధికారికంగా పోగేసుకోవడానికి రాజకీయాలు చక్కని రాజమార్గాలై పోయాయి.

భాజపా 'విజన్' - మతోన్మాద ఫాసిజానికి ముసుగు

- కె.బాలగోపాల్

రాజకీయవాదులు మాట్లాడే మాటలను ఉన్నదున్నట్లు అర్థం చేసుకునేటట్టయితే ఏమీ అర్థంకాని స్థితి వస్తుంది. ముందు చెప్పినవీ వెనుక చెప్పినవీ పైన చెప్పినవీ లోన చెప్పినవీ అధికారికంగా చెప్పినవీ అనధికారికంగా చెప్పినవీ అన్నీ కలిపి అర్థం చేసుకోకపోతే ఏమీ అర్థం చేసుకోలేము.

అయోధ్య గురించి బి.జె.పి. వారి విజన్ పత్రంలోనూ, దాని విడుదల సందర్భంగానూ చెప్పిన విషయాలొకసారి చూడండి.

'అయోధ్య విషయంలో అందరూ కోర్టు తీర్పుకు కట్టుబడి ఉండటమే ఉత్తమం.'

'ఆ సమస్య హిందువులకూ ముస్లింలకూ మధ్య చర్చల ద్వారా పరిష్కారం కావడం సరయినది.'

'అయోధ్యలో రామాలయం కడతాం. రామజన్మస్థలంలోనే కడతాం. దేశంలో మతసామరస్యానికి అది చాలా బలాన్ని ఇస్తుంది.

ఈ మూడు ప్రకటనలూ విన్నాము, వింటున్నాము కదా? అక్కడే రామాలయం కట్టడానికి కోర్టు తీర్పు అనుకూలించకపోతే ఏమవుతుంది? కోర్టు తీర్పు హిందువులకు గానీ, ముస్లింలకుగానీ (ఇద్దరికీగానీ) నచ్చకపోతే ఏమవుతుంది? అక్కడే రామాలయం కట్టాలన్న ఒప్పందం చర్చలలో కుదరకపోతే ఏమవుతుంది?

అందువల్ల ఈ ప్రకటనలు అసంబద్ధమైనవనే నిర్ణయానికి మీరు వస్తున్నారా? దయచేసి ఆ పొరబాటు చేయొద్దు. హిందుత్వ వాదులలో చాలా లోపపాలున్నాయిగానీ తర్కలోపం లేదు. వారి తర్కాన్ని మీరు అర్థం చేసుకోవాలంటే. పై మూడు వాక్యాలను కింది నుండి మీదికి చదవండి. రామాలయం అక్కడే కట్టాలి. దానికి ముస్లింల చర్చలలో ఒప్పుకోవాలి. అప్పుడే వారిపైన దాడులు ఆగుతాయి. ఈ రాజీని కోర్టు ముందు పెట్టాలి. కోర్టు తన తీర్పులో దానికి ఆమోదముద్ర వేయాలి. (లాయర్లు దీనిని కాంప్రమైజ్ డిక్రీ అంటారు)

ఇప్పుడు ఏ అసంబద్ధతా లేకుండా స్పష్టంగా అర్థం అయింది కదా? కోర్టు తీర్పుకే అందరూ కట్టుబడి ఉండాలంటే అర్థం కోర్టు తన బుద్ధికి తోచిన రాజీ ప్రతిపాదించవచ్చునని కాదు. బయట జరిగే రాజీని కోర్టు ఆమోదించాలని దానికి అందరూ కట్టుబడి ఉండాలని అర్థం రాజీ చర్చలతో అది పరిష్కారం కావాలంటే అర్థం ముస్లింలు తమ బుద్ధికి తోచిన రాజీ ఫార్ములాను ప్రతిపాదించవచ్చునని కాదు. అక్కడే రామాలయం కట్టాలన్న రాజీకే ఒప్పుకోవాలని అర్థం.

ఇప్పుడంతా ఖుల్లాగా అర్థం అయింది కదా?

ఇక్కడ తార్కిక అసంబద్ధత లేదుగానీ నైతిక అసంబద్ధత దండిగా ఉంది. చర్చలు, రాజీ అంటూ పరిష్కారం నేను ముందే నిర్ణయిస్తాననడం, కోర్టు తీర్పే శిరోధార్యం అంటూ మేము బయట కుదిర్చే రాజీకే కోర్టు ఆమోదముద్ర వేయాలనడం నైతికంగా అసంబద్ధమైన ప్రవచనాలు. అందులో అసంబద్ధత కనిపించకపోవడం సంఘ్‌పరివార్ దృష్టికోణంలోని విలక్షణత. వారి బుద్ధే అటువంటిది.

> ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ యుద్ధాల తరువాత సాధారణ మనుషులు కూడా అగ్రరాజ్యం అనే మాటను అసహ్యించుకుంటున్నారు. ప్రపంచంలో అగ్రరాజ్యాలనేవి లేకుండా ఎట్లా చేయాలనేది సాధారణ ప్రజాతంత్ర స్పృహ ఉన్న వారందరినీ కదిలిస్తున్న విషయం కాగా, మనము సైతం ఒక అగ్రరాజ్యం అవుదామన్న 'విజన్'ను బి.జె.పి. ప్రతిపాదిస్తున్నది. అధికారాన్ని ఆరాధించే గుణం సంఘ్‌పరివార్ నరనరాలలోనూ వ్యాపించి వున్న ఒక వికారమైన లక్షణం.

భారతీయ జనతా పార్టీ వారి 'విజన్'లోని అన్ని విషయాలను ఈ విధంగా తర్జుమా చేసుకొని అర్థం చేసుకోవాలి. తర్జుమా చేసుకోవడానికొక నిఘంటువు కావాలి. ఆ నిఘంటువు గోల్వాల్కర్ సాహిత్యం. వీరి ప్రతీ వాక్యాన్నీ వారి మాటలలోకి అనువదించుకున్నప్పుడే స్పష్టత వస్తుంది.

భారతదేశాన్ని 2020 నాటికి ఒక అగ్రరాజ్యం (గ్రేట్‌పవర్, సూపర్‌పవర్ అనేవి వారు వాడుతున్న పదాలు) చేయాలన్నది బి.జె.పి. 'విజన్'లోని ఒక ముఖ్య అంశం. గోల్వాల్కర్ ఆలోచనా విధానంలో ఇది కేంద్ర బిందువు. నిన్నటి దాకా భారత రాజకీయాలలో అగ్రరాజ్యం అనేది ఒక చెడ్డమాట. ఆర్.ఎస్.ఎస్. శాఖలలో తప్ప వేరే ఎక్కడా దానినొక గౌరవనీయమైన భావనగా ఎవరూ అనుకోలేదు. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ యుద్ధాల తరువాత సాధారణ మనుషులు కూడా అగ్రరాజ్యం అనే మాటను అసహ్యించుకుంటున్నారు. ప్రపంచంలో అగ్రరాజ్యాలనేవి లేకుండా ఎట్లా చేయాలనేది సాధారణ ప్రజాతంత్ర స్పృహ ఉన్న వారందరినీ కదిలిస్తున్న విషయం కాగా, మనము సైతం ఒక అగ్రరాజ్యం అవుదామన్న 'విజన్'ను బి.జె.పి. ప్రతిపాదిస్తున్నది. అధికారాన్ని ఆరాధించే గుణం సంఘ్‌పరివార్ నరనరాలలోనూ వ్యాపించి వున్న ఒక వికారమైన లక్షణం. వాళ్ళ గురువులు హిట్లర్‌ను

ఊరికే ఆరాధించలేదు. అక్కడి నుండే భారత్ ఒక అగ్రరాజ్యం కావాలన్న కాంక్ష పుట్టింది. గోల్వాల్కర్ రచనలలో అది పదేపదే వ్యక్తమవుతుంది. ఇప్పుడు మన దౌర్భాగ్యం కొద్దీ మనల్ని ఇంకొంతకాలం ఏలబోయేవారు దానిని దేశానికే 'విజన్' చేసేశారు.

మైనారిటీల విషయంలోనూ ఈ 'విజన్'లో దాడులు, మారణకాండ ఇక మీద జరగబోవన్న హామీ ఏదీ లేకపోగా, ముస్లింలు గతాన్ని మరచిపోవలసిన సమయం ఆసన్నమైందని అద్వానీ పదేపదే అంటున్నాడు ('రికన్సిలేషన్'కు సిద్ధం కావాలన్నది ఆయన వాడుతున్నమాట). దేశంలో ఎనభైరెండు శాతం ప్రజల (అంటే హిందువుల) మనోభావాలను లెక్కచేయకుండా పాలనసాగే రోజులు పోయాయనీ, పద్దెనిమిది శాతాన్నే పౌరులుగా భావించే కాలం గడిచిపోయిందనీ వ్యాఖ్యానిస్తున్నాడు. మైనారిటీలకు విద్య, ఆర్థిక పురోగతి, కల్పిస్తామన్న 'విజన్' హామీని ఈ అర్థరహిత ప్రేలాపనతో కలిపి అర్థం చేసుకోవాలి. గుజరాత్‌ను, బాబ్రీమసీదనూ, గ్రహం స్టెయిన్స్‌ను మైనారిటీలు మరచిపోవాలి. తమ మీద ప్రత్యేకమైన దృష్టి పెట్టడం అవసరం అన్న ప్రజాతంత్ర రాజకీయ డిమాండ్‌ను విడిచిపెట్టాలి. అద్వానీ చెబుతున్నట్టు, హిందువులు-ముస్లింలు అన్న తేడాను మరచిపోవాలి. (మరచిపోవలసింది ముస్లింలే, హిందువులు కాదు - హిందువులు కూడా హిందూ అన్న భావనను మరచిపోవాలని ఒక ఆర్.ఎస్.ఎస్. నాయకుడు అనగలడా? అపచారం! అపచారం!) అప్పుడు విద్య, ఆర్థిక పురోభివృద్ధులకు ప్రభుత్వం చేయూతనిస్తుంది.

ఆర్థిక రంగంలో, దేశంలోని నగరాలను ప్రపంచంలోని ప్రధాన నగరాలను తలపింప చేసేటట్టు తీర్చిదిద్దుతామన్నదీ, మరొక హరిత విప్లవం సాధిస్తామన్నదీ, చిన్నతరహా పారిశ్రామిక రంగాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామన్నదీ ప్రధానంగా ఇచ్చిన హామీలు. ఇవి ఇప్పటికే మొదలయ్యాయి కాబట్టి వీటి భావమేమిటో అనుభవపూర్వకంగా చెప్పవచ్చు.

హైదరాబాద్‌ను సింగపూర్ నమూనాలో మార్చడానికి చంద్రబాబు మొదలుపెట్టిన ప్రయత్నం, ఫలితాన్ని ఈ నగర వాసులందరం చూస్తున్నాం. అప్పుడప్పుడు నగరానికి వచ్చిపోయే వారికి, పెరిగిన రోడ్ల వెడల్పూ వీధికొక్క ఫ్లైఓవర్‌లూ కళ్ళు మిరుమిట్లు గొలిపే లైట్లూ దీనికి సంకేతాలుగా కనిపించవచ్చునుగానీ ఇక్కడుండే వారికి దీని అసలు భావం గుడిసెల కూల్చివేత అని తెలుసును. 'కర్మన్‌ఘాట్'కు పోతావా, కూకట్‌పల్లికి పోతావా' అన్నది ఈ నగర అభివృద్ధి నినాదం. తాతల కాలం నుండి ఇక్కడే ఉంటున్నాం, ఇక్కడే ఇళ్ళపట్టాలు ఇవ్వండి అని అడిగిన వారందరితోనూ నగరం మధ్యభాగానికి ఇరవై కిలోమీటర్ల దూరాన ఉన్న ఈ రెండు ప్రాంతాల పేర్లు చెప్పి ఇక్కడో అక్కడో స్థిరపడతామని ఒప్పుకుంటే వెంటనే పట్టా ఇచ్చి వెళ్ళగొట్టేస్తామని దయగల కలెక్టర్లు ఇక్కడ అయిదేళ్ళుగా అంటున్నారు.

ఇక రెండవ హరిత విప్లవం మొదటి హరిత విప్లవం కంటే చాలా భిన్నంగా ఉండబోతుంది. నిజానికి ఇదేమంత 'హరితంగా' ఉండబోదు. యూరప్‌లో మార్కెట్ ఉన్న పూతోటలూ రొయ్యల చెరువులూ వ్యాపార ప్రయోజనం ఉన్న కలవ మొక్కలూ వర్ధిల్లబోతాయి. మొదటి హరిత విప్లవంలో ఎన్ని లోపాలున్నా అది ఆహారం కొరతను కొంత తగ్గించింది. వ్యవసాయ కార్మికులకు కొంత పని కల్పించింది. రేపు రాబోయే 'మరొక్క హరిత విప్లవం' ఈ రెండు సమస్యలనూ పెంచబోతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ కట్టుబాట్లను తిరస్కరించి మరొక్క హరితవిప్లవం గురించి మాట్లాడితే దానినుండి ఏమైనా ప్రయోజనం ఆశించి ఉండవచ్చునేమోగానీ ఈ 'విజన్'లో మన అసలు పాలకుల గురించి ఒక్క ముక్కాలేదు. సోనియాగాంధీ జన్మస్థలం తప్ప వేరే ఏ విదేశీ విషయం ప్రస్తావనా లేదు! వీరు తీసుకురాబోయే హరిత విప్లవం గ్రామీణ ప్రాంతాలలో ఆకలిని పెంచబోతుంది.

కాశ్మీర్ విషయానికొచ్చేసరికి, ఆర్టికల్ 370ని రద్దు చేయాలి అన్న నినాదాన్ని విడిచిపెట్టి, టెర్రరిజం ప్రస్తుతం ప్రధాన సమస్య అన్నారని ఈ 'విజన్'ను వ్యాఖ్యానించిన వారంతా గుర్తించారు. దానికి కారణం స్పష్టమే. హురియత్ కాన్ఫరెన్స్‌తో చర్చలు బి.జె.పి. వారు కొత్తగా తగిలించుకున్న శాంతి దూతలు వేషానికి చాలా అవసరం. ఢిల్లీతో భేషరతు చర్చలకు ఒప్పుకున్నందుకు హురియత్ కాన్ఫరెన్స్ ఇప్పటికే కాశ్మీర్‌లో సగం పరువు పోగొట్టుకుంది. ఢిల్లీ పాలకులు ఆర్టికల్ 370 రద్దు చేస్తామన్న ప్రకటనను పునరుద్ఘాటించినట్టయితే మిగిలిన పరువు పోతుందన్న భయానికి హురియత్ నేతలు చర్చలకు తెగతెంపులు చేసేసుకోగలరు. అప్పుడు శాంతివేషం ఏమయిపోవాలి?

ప్రజా ఉద్యమాల నుండి వస్తున్న ఒకే ఒక డిమాండును ఈ 'విజన్' నేరుగా ప్రస్తావించింది. అది కూడా తిరస్కరించడానికి ప్రస్తావించింది. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలన్న అతి ముఖ్యమన డిమాండ్‌ను ప్రస్తావిస్తూ, దానిబదులు ఎస్‌సి, ఎస్టీలకు ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చే సంస్థలకు పన్నులలో తగ్గింపులు ఇచ్చే ఆలోచన చేద్దామని అంటుంది. అక్కడికేదో అందరూ పన్నులు కట్టేస్తున్నట్టు, మన పాలకులు సేకరించేస్తున్నట్టు! అయినా ఒక హక్కుగా కల్పించమని అడిగితే, దయతో ఇచ్చే వాటికి నేను రాయితీ ఇస్తాననడం ఏం జవాబు?

బి.జె.పి. తన విజన్‌ను ప్రకటించిందంటే రెండు విషయాలలో ఏమైనా విధానపరమైన మార్పు ఉందేమోనని వెతకడం సహజం. ఒకటి వారి అధికార భావజాలమైన సాంస్కృతిక జాతీయవాదాన్ని (అంటే నువ్వు ఏ దేవుడినైనా కొలుచుకో, కానీ హైందవ సంప్రదాయం జాతి వారసత్వమని ఒప్పుకో) ఏమైనా మార్చుకున్నారా అనేది, రెండు ఆర్థిక సంస్కరణల గురించి ఏమైనా పునరాలోచన చేస్తున్నారా అనేది. ఈ రెండు విషయాలలోనూ ఏమీ తేడా లేదనేది వారి విజన్ సారాంశాన్ని చదివినా స్పష్టం అవుతుంది. ○

మార్కెట్ విషవలయంలో గిజగిజలాడుతున్న బక్కరైతు

– వికాస్

ప్రభుత్వాలెన్ని మారినా, పాలకులెందరొచ్చినా వ్యవసాయంలో రైతు సమస్యలకు పరిష్కారం కనుచూపుమేరలో కనిపించడమే లేదు. ఏటేటా తగ్గుతున్న దిగుబడులు, పెరిగిపోతున్న ఉత్పత్తి ఖర్చులతో, ఉత్పత్తులకు మార్కెట్లో తగ్గుతున్న ధరల కారణంగా రైతులు ఏటా వేలాది రూపాయల నష్టాన్ని చవిచూస్తున్నారు. గిట్టుబాటు ధరల విషయంలో రైతులు చేస్తున్న ఆందోళన అంతా అరణ్యరోదనగానే మిగిలిపోతుంది. ప్రభుత్వ నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. ఉత్పత్తి ఖర్చులను ప్రమాణంగా తీసుకోకుండా అశాస్త్రీయ విధానాలతో ప్రకటిస్తున్న మద్దతు ధరలకు సైతం రైతుల ఉత్పత్తులను అమ్మించడంలో ప్రభుత్వం వ్యాపారస్తుల వైపే నిలబడడం, ప్రతీ పంట విషయంలోనూ ప్రతిసారి ఎప్పటికప్పుడు రుజువవుతూనే ఉంది. మొక్కజొన్న, పసుపు, మిర్చి, టమాటా ఉత్పత్తులకు మార్కెట్లో లభిస్తున్న ధరల పట్ల రైతులు వెలిబుచ్చుతున్న ఆగ్రహానికి మార్కెట్ కార్యాలయాల్లో ఫర్నిచరు తదితర సామగ్రి బూడిదవుతుంది. క్వింటాళ్ళకొద్దీ పసుపు, మిర్చిలను తగులబెట్టడం, టన్నులకొద్దీ టమాటాలను రోడ్ల మీద పారపోయడం ద్వారా, రైతులు తమ నిరసనను వ్యక్తపరుస్తూనే ఉన్నారు. ఇలా ఎందుకు జరుగుతుంది? ఎంతకాలం జరగాలి?

మార్కెట్‌లో రైతులు తమ ఉత్పత్తులను అమ్మే సమయంలో విపరీతంగా నష్టపోతున్నారు. ఈ విషయం దీని చివర ఇచ్చిన గణాంకాలను గమనిస్తే స్పష్టమవుతుంది. ఈ పట్టికల్లో 3-4 కాలంలలో ఉన్న తేడా (5వ కాలంలో ఇవ్వబడింది) రైతు కనిష్ట ధరకు అమ్మిన ప్రతి క్వింటాలుకు నష్టపోయే ఆదాయాన్ని సూచిస్తుంది. ఈ నష్టం పంట అమ్మగా వచ్చిన ఆదాయం కన్నా ఎక్కువగా ఉండటాన్ని గమనించవచ్చు. అలాగే ఉల్లిగడ్డ పండించే పేద, మధ్య తరగతి రైతులు (ప్రతి సంవత్సరం) పంట వచ్చిన వెంటనే అమ్మటంవల్ల నష్టపోతున్నారు. ఉల్లిపాయలు, పసుపు, ప్రత్తి, మిరప, వేరుశనగ పండించే రైతులు కూడా తమ ఆదాయాల్ని గణనీయంగా కోల్పోతున్నారు.

కొన్ని సంవత్సరాల్లో ఈ నష్టపోయిన ఆదాయం చాలా హెచ్చుగా ఉంటూ, ఇంకో సంవత్సరం ఇది కనిష్ట స్థాయిలో ఉండటాన్ని కూడా గమనించవచ్చు. ఉదాహరణకు ఎల్లిపాయల రేట్లను గమనించితే, ఇదే స్పష్టమవుతుంది. 2001-02లో ఈ రైతులు 146 శాతం ఆదాయం కోల్పోగా, ఆ తరువాత సంవత్సరం (2002-03లో) కనిష్ట ధరపై 21.1 శాతం మాత్రమే ఆదాయాన్ని కోల్పోయారు.

ఎండుమిరప, వేరుశనగ, చింతపండు ధరలు 1999-00 ధరలతో పోలిస్తే, అలాగే వర్జినియా పొగాకు 1998తో పోల్చినపుడు క్రమంగా తగ్గిపోవడాన్ని కూడా గమనించవచ్చు. ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో, ఇలా తరుగుతున్న ఆదాయంలో ఈ రైతుల జీవనాన్ని కృంగదీస్తున్నవి.

ఎండుమిరప కనిష్ట ధరలు క్రమంగా తగ్గుతూ, 3-3-04న అతి తక్కువ స్థాయికి చేరాయి. (రు.1800 మోడల్ ధర). వేరుశనగ మోడల్ ధర 3-3-04న క్వింటాలుకు రు.1649 ఉండగా, అంతకుముందు సంవత్సరం (2002-03) దీని సగటు ధర రు.1700.74గా ఉండేది. అలాగే 3-3-04న రు.1069గా ఉన్న కనిష్టధర 2002-03 సగటు కనిష్ట ధర 1464.55 కన్నా చాలా తక్కువగా ఉన్నది.

ప్రభుత్వ సంస్థ గిరిజన కార్పొరేషన్ చురుకైన పాత్రవల్ల చింతపండు ధరల హెచ్చుతగ్గులు (1999-00 తప్ప) కనీస స్థాయిలో ఉన్నాయి. అయితే, కనిష్ట చింతపండు ధరలు ప్రతి సంవత్సరం తగ్గుతూ వస్తున్నాయి. చింతపండు అమ్మకం మీదే ఆధారపడే అటవీ ప్రాంతాల ప్రజల జీవనస్థాయి ఈ ధర తగ్గతుండడం వల్ల, క్షీణిస్తుండటాన్ని గమనించవచ్చు.

వర్జీనియా పొగాకు ధర కూడా 1998 ధరతో పోలిస్తే, క్రమంగా తగ్గుతూవస్తుంది. 2001లో ప్రకటించిన క్రాప్ హాలిడే వల్ల ఆ తరువాత సంవత్సరం ధరను పెంచడంలో ఏమీ తోడ్పడలేదు. పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చు నేపథ్యంలో, ఈ పంట పండించే రైతులు శ్రమకు తగ్గ ఆదాయంలేక, చాలా ఇబ్బంది పడుతున్నారు. పైగా, 2003లో వచ్చిన రేటు (రు.34.83 కిలో) మద్దతు ధర రు.33ల కన్నా నామమాత్రంగానే హెచ్చుగా ఉన్నది. 1998లో సగటు ధర (రు.40.12 కిలో) మద్దతు ధర (రు.25.50 కిలో) కన్నా చాలా అధికంగా ఉండేది. ఫలితంగా, 2003లో పొగాకు రైతులు ఆదాయం అంతకు ముందు సంవత్సరాలతో పోల్చినపుడు, చాలా తగ్గిపోయింది.

ఇలా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు హెచ్చు తగ్గులకు ప్రధాన కారణం వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, మార్కెటింగ్‌లో శాస్త్రీయ విధానం లేకపోవడమే.

ఇక వ్యవసాయ ఉత్పత్తుల హెచ్చు తగ్గులు అన్ని వర్గాల రైతుల మీద ఒకే విధంగా ఉండదు. పేద రైతులు, మొత్తం ఉత్పత్తిని, మధ్య తరగతి రైతులు కొంతమేర తమ ఉత్పత్తులను పంట కోసిన వెంటనే తమ తక్షణ అవసరాలు తీర్చుకోడానికి మార్కెట్‌లో అమ్ముకోవాల్సి ఉంటుంది. ఈ సమయంలో ఆయా ఉత్పత్తుల ధరలు కనిష్ట స్థాయిలో ఉంటాయి. పంట నిల్వ చేసుకొని ఆ తరువాత అమ్మితే, అధిక ధర వస్తుందని తెలిసినా, నిల్వ చేసుకోలేని నిస్సహాయ స్థితి పేద రైతులది. ఫలితంగా మార్కెట్‌లో ఈ రైతులు కష్టపడి పండించిన ఉత్పత్తికి గణనీయంగా ఆదాయాల్ని కోల్పోతున్నారు. ఇదే ధనిక రైతులు తమ ఉత్పత్తులను గరిష్ట ధర వచ్చేంతవరకు నిల్వ చేసుకుని అమ్ముకోవచ్చు. అందువల్ల, వ్యవసాయ ఉత్పత్తుల ధరల హెచ్చు తగ్గుల ప్రభావం పేదవారిపై చాలా తీవ్రంగా ఉంటుంది.

పేద రైతుల ఆదాయాల్ని పెంచుకోవడానికి, మార్కెట్‌లో ప్రభుత్వ జోక్యం ఒక మార్గం. కొన్ని పరిమితులకు లోబడి, ఈ ప్రభుత్వ మార్కెట్

జోక్యం పేద రైతుల ఆదాయాల్ని రక్షిస్తుంది. మరి, స్వేచ్ఛా వ్యాపారం పేరుతో పూర్తి ప్రైవేటు టోకు వ్యాపారం పేద రైతులను దివాలా తీయించడం ఖాయం. ఈ విధానాల్ని మార్చలేమా? వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, మార్కెటింగ్‌లో శాస్త్రీయ విధానం రూపొందించి, అవలంబించలేమా? అంతా మార్కెట్‌కు వదలటమే శాస్త్రీయమా? ఆలోచించండి!?

మాసపు సగటు

సంవత్సరం	సగటు ధర	మాసపు సగటు		కనిష్ట ధరకు అమ్మిన రైతులు	
		కనిష్ట ధర	గరిష్ట ధర	కోల్పోయిన ఆదాయం	శాతం
1	2	3	4	5	6
			వేరుశనగ కాయలు		
1999-00	1341.52	1252.22	1456.60	204.38	16.3
2000-01	1366.31	1184.53	1546.10	361.57	30.5
2001-02	1367.19	1215.25	1450.20	234.95	19.3
2002-03	1700.74	1464.55	1930.17	465.62	31.8
4-12/2003	-	1725.00	2024.71	299.71	17.4
1/2004	1720.00	-			
3-3-04న	1649.00	1069.00	1852.00	-	-
(కర్నూలు మార్కెట్)	(మోడల్ ధరలు)				
			ఉల్లిగడ్డలు		
1999-00	427.06	253.75	535.42	281.67	111.0
2000-01	425.31	244.17	632.50	595.00	159.1
2001-02	502.08	341.67	830.00	488.33	142.9
2002-03	444.79	304.37	610.21	305.84	100.5
4-12/2003	-	375.00	760.00	385.00	102.7
1/2004	750.00	-	-		
3-3-04న	460.00	435.00	480.00		
(కర్నూలు మార్కెట్)	(మోడల్ ధరలు)				
			ఎల్లిపాయలు		
1999-00	2604.57	1875.00	2875.00	1000.00	53.3
2000-01	1632.17	1095.50	2412.00	1316.50	120.2
2001-02	2465.67	1500.00	3700.56	2200.56	146.7
2002-03	2867.08	2601.40	3148.98	547.58	21.1
4-12/2003	-	1690.00	3148.98	1458.98	86.3
1/2004న	1620.00	-	-	-	-
	(మోడల్ ధర)				
			గింజలేని చింతపండు		
1999-00	2777.38	1554.17	3500.00	1945.83	125.2
2000-01	1516.90	1400.00	1573.51	173.51	12.4
2001-02	1343.61	1233.33	1445.0	211.67	17.2
2002-03	1364.28	1245.83	1600.00	354.15	28.4
4-12/2003	-	1490.00	1610.00	120.00	8.1
1/2004	1610.00	-	-	-	-

వర్జినియా పొగాకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సేకరించినది.

సంవత్సరం	సగటు ధర (రూ. కిలోకు)	2001	క్రాఫ్ హాలిడే
1998	40.12	2002	33.22
1999	34.88	2003	34.83
2000	32.16		

మూలం:- 1999-03 ధరలు ఆంధ్రప్రదేశ్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మార్క్‌ఫెడ్ వెబ్‌సైట్ 5, 6 కాలంల్లో ఇచ్చిన వివరాలు వ్యాసకర్త లెక్కించినవి. మరికొన్ని పట్టికలను "రెండురెళ్ళ నాలుగు"లో చూడండి.

ఎన్నికలు - మహిళల ఎజెండా - కర్తవ్యం

- పశ్య పద్మ
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
(ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య)

మనదేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి అత్యున్నత వేదికైన 14వ లోక్‌సభకు, రాష్ట్ర 12వ శాసనసభకు ఎన్నికలు జరుగుతున్నాయి. దేశంలో, మన రాష్ట్రంలో ఎన్నికల కోలాహలం ప్రారంభమై ఊపు అందుకుంది. వివిధ రాజకీయ పార్టీల అధినేతల ఎన్నికల శంఖారావం, వాగ్దానాల పరంపరలు ఆసక్తిని, ఉత్కంఠను పెంచుతున్నాయి. ఈ ఎన్నికలు అత్యంత ప్రాధాన్యత కల్గినవి. ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ నాయకులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ప్రదర్శనలు, బహిరంగ సభలు, ఇంటింటికి ప్రచారం, అందుబాటులోకి వచ్చిన ఎలక్ట్రానిక్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. సెల్, మొబైల్ ఫోన్స్ ద్వారా నేరుగా ఓటరుతో మాట్లాడే అవకాశం ఏర్పడింది. ఈ కార్యక్రమానికి విపరీతంగా డబ్బు ఖర్చు పెడుతున్నారు. టెలివిజన్ ఛానల్స్‌లో ఎన్నికల ప్రచారానికై చంద్రబాబు నాయుడుగారు 10 కోట్లు ఖర్చుపెట్టి టి.వి. ఫిల్మ్‌లు తయారు చేయించారు. పది రోజులపాటు ఐదు ప్రైవేటు ఛానళ్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ఘనకార్యాలను ఏకరువు పెట్టారు. గత వంద మాసాలలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యకలపాలపై ప్రోగ్రెస్ రిపోర్టులను ముఖ్యమంత్రిగారు విడుదల చేశారు. భారత్ వెలిగిపోతుంది అన్న ప్రచరంతో ఉపప్రధాని ఎల్.కె. అద్వానీగారు ప్రచార రథం ద్వారా దేశమంతా తిరుగుతున్నారు.

ఈ ఎన్నికలు ముందస్తు ఎన్నికలు- ముఖ్యంగా మహిళలు ముందుగానే నిర్ణయానికి రావల్సిన అవసరం ఉంది. వివిధ రాజకీయ పార్టీలు-వాటి ఎన్నికల ప్రణాళికల అసలు నైజాన్ని అర్థం చేసుకోవాలి. గడిచిన నాలుగున్నర సం॥రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ప్రజలు, మహిళల బ్రతుకుల్లో ఏమైనా మెరుగైన స్థితిగతులు ఏర్పడ్డాయా లేదా అని బేరీజు వేసుకోవాలి. వచ్చే ఐదేళ్ళ కాలానికి తమ భవిష్యత్తునూ శాసించే శాసనకర్తలను ఎన్నుకునే అధికారం ఒక్క రోజే ఓటరు చేతిలో వుంటుంది కనుక ఎట్లా ఈ అధికారాన్ని వినియోగించుకోవాలో జాగ్రత్త పడాలి. ప్రభుత్వాల నూతన ఆర్థిక విధానాల వల్ల వచ్చిన ఫలాలు, ఫలితాలు ఎవ్వరికి చేకూరాయి? ఈ విధానాలు ప్రతికూలంగా నిలిచి ఎవ్వరి నిండు జీవితాలను బలిగొన్నాయి? అని పరిశీలిస్తే ఈ విధానాల దుష్ఫలితంగా పేదరికం, హింస పెరగడంతో మహిళలు, నిరుపేద ప్రజలు జీవించే హక్కును సహితం కోల్పోయారు.

5 సం॥లు వరుసగా ఏర్పడిన కరువు పెరిగిన పేదరికాన్ని తట్టుకోలేక మన రాష్ట్రంలో అనేక జిల్లాలలో పసికందులైన కన్నబిడ్డలను, అమ్ముకున్నారు. ఇటీవల ఒరిస్సాలో నెలరోజుల బిడ్డను కేవలం 10 రూపాయలకే ఓ తల్లి అమ్ముకుంది. పంజాబ్‌లో 6వారాల బిడ్డను 50 రూపాయలకే అమ్ముకున్నారు. ఆర్థిక పరిస్థితులు ఛిద్రం కావడంతో రైతు, నేత కార్మికుల ఆత్మహత్యలు, ఆకలి చావులు నిత్యకృత్యమయ్యాయి.

మహిళా సాధికారత సాధనకు ప్రభుత్వాల విధానాలు పెద్ద అడ్డంకిగా నిలుస్తున్నాయి. అన్ని రంగాలలోను మహిళలపైన ఈ విధానాల దుష్ప్రభావం కనిపిస్తుంది. విచ్చలవిడి ప్రైవేటీకరణ, స్వచ్ఛంద పదవీ విరమణ పథకాలు, సిబ్బంది తగ్గింపు తదితర ప్రభుత్వ విధానాలు పనిచేసే మహిళల పైన గొడ్డలి పెట్టులాగా తయారయ్యాయి. ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలలో మహిళలకు ఉద్యోగాలు లభించడం లేదు. ప్రమోషన్ కోసం అందించే శిక్షణ విషయంలోనూ నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఎగుమతుల వృద్ధి, ప్రత్యేక జోన్లలో మహిళలు తీవ్రహింసకు గురవుతున్నారు. వారికి కనీస సౌకర్యాలు వుండటంలేదు. వృత్తిపరమైన భద్రత, ఆరోగ్య భద్రతా చర్యలు లేవు. అసంఘటిత రంగంలో యాంత్రికరణ, ఆధునిక సాంకేతిక విజ్ఞానం ప్రవేశించడం వల్ల మహిళలు జీవనోపాధిని కోల్పోతున్నారు. సంప్రదాయకంగా వస్తున్న వృత్తినైపుణ్యం స్థానంలో యంత్రాలు ప్రవేశించడం వల్ల వారి ఆదాయాలు పోవడమేకాక వృత్తినైపుణ్యం కూడా హరించుకుపోతున్నది. సంఘటిత రంగంలో 17 శాతం మాత్రమే మహిళలున్నారు. ప్రభుత్వాల రిట్రెంచ్‌మెంట్ పాలసి (సిబ్బంది తగ్గింపు) వల్ల 80,000 మంది (ఉద్యోగినిలు) మహిళలు ఉద్యోగాలను కోల్పోయారు. రిట్రెంచ్‌మెంట్ పాలసి వల్ల ఎందరో పురుషులు ఉద్యోగాలు కోల్పోవడంతో ఆ కుటుంబాల మహిళలు బలవంతంగా తాత్కాలిక వేతనాలపై పనులు చేసుకోవాల్సి వస్తుంది. ఎక్కువ చాకిరి తక్కువ చెల్లింపులతో జీవనం సాగిస్తున్నారు. శీఘ్రంగా విస్తరించిన గృహాధారిత ఉపాధి సెక్టారులో 90 శాతం మంది మహిళలే. అయితే వారిపై ఒత్తిడి, పీడన తీవ్రతరమయ్యాయి. డబ్బులు చాలకపోవడంతో పిల్లలతో సహా కుటుంబమంతా గంటల తరబడి ఈ పనులు చేయాల్సివస్తుంది. ఈ రంగానికి కార్మిక చట్టాలు వర్తించడం లేదు. కనీస వేతనాలుగాని, పనిగంటలుగాని, లీవులుగాని ఇలాంటి నిబంధనలేవీ లేవు.

మరోవైపు సంఘటిత రంగం క్రమంగా అసంఘటిత రంగంగా

> ప్రైవేటీకరణ మహిళల పాలిట శాపంగా మారింది. త్రాగునీరు తీసుకువచ్చే బాధ్యత ఎక్కువభాగం మహిళలదే గనుక యమయాతనలు పడుతున్నారు. సంపాదించిన డబ్బును త్రాగునీరు కొనడానికి వెచ్చించాల్సి వస్తుంది. ఆహార భద్రత కొరవడింది. కావాలని ప్రభుత్వ (ఆహార ధాన్యాల) పంపిణీ వ్యవస్థను దెబ్బతీయడం వల్ల 13 రాష్ట్రాలలో ఆకలి చావులు సంభవించాయి. ఏదోవిధంగా ప్రాణాలు నిలుపుకోవాలన్న ఆశలు మహిళలను చివరకు పడుపువృత్తికి దారి తీయిస్తున్నాయి. మహిళలను ఇంతటి విషమ పరిస్థితుల్లోకి నెట్టడం ద్వారా మహిళా సాధికారతను ఈ ప్రభుత్వాలు సాధిస్తాయా?

మారుతున్న కారణంగా యిక్కడ పెద్ద సంఖ్యలో పనిచేస్తున్న మహిళలు పనులు కోల్పోతున్నారు. పరిణామాత్మక ఆంక్షల తొలగింపు లఘు పరిశ్రమల రంగాన్ని, సహకార, కుటీర పరిశ్రమల రంగాలను దెబ్బతీసింది. ఈ రంగాలలో బీడి, నేత, గీత, మత్స్య, వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు మహిళలే అత్యధికంగా పనిచేస్తున్న కారణంగా సహజంగా వారు నష్టపోయారు. 88 శాతం మహిళలు గ్రామంలో పనిచేస్తున్నారు. వీరిలో 35 శాతం మహిళలు భర్తలు చనిపోవడం, వదిలివేయడం యితరత్రా కారణాల వల్ల కుటుంబ పెద్దగా బాధ్యతలు వహిస్తున్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు బీమా పథకాన్ని యిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం నమ్మిస్తుంది. కాని యిప్పటి వరకు ఎంతమందికి యిచ్చారు? అన్న విషయంలో సమాచారం లేదు. మహిళలకు కనీస సమాన వేతనాలు దొరకడం లేదు. ఎలాంటి ప్రసూతి సౌకర్యం, పని గ్యారంటీ లేదు. సం॥నికి కేవలం 60 రోజులు మాత్రమే పని దొరుకుతుంది. మిగతా మూడువందల ఐదు రోజులు పని లేకపోవడంతో పస్తులుంటూ గడపాల్సిన దారుణమైన విషమ పరిస్థితులు, వాస్తవాలు యింత దారుణంగా వుంటే ప్రభుత్వాలు 33 శాతం ఉద్యోగ రిజర్వేషన్లను అమలు చేస్తున్నామని చెప్తూ క్షణక్షణం మహిళలెదుర్కొంటున్న సామాజిక, ఆర్థికపరమైన మౌలిక సమస్యలను దాచిపెడుతున్నాయి.

సమిష్టితత్వంలో జీవితావసరాలకు తీర్చుకొనే ఉద్దేశంతోపాటు, సాంఘిక న్యాయం కోసం గ్రామస్థాయిలో ఉద్యమించాలనే లక్ష్యాలుండాల్సిన మహిళా పొదుపు సంఘాల్లో పోరాటాలను హైజాక్ చేసి, కేవలం పొదుపు చేసి అప్పులు ఇచ్చిపుచ్చుకునే మేరకే పరిమితం చేసి ప్రభుత్వం తన అధీనంలో పొదుపు సంఘాలను కొనసాగిస్తూ మహిళా పోరాట చైతన్యాన్ని నిర్వీర్యపరుస్తుంది.

సామాజిక, ఆర్థికాభివృద్ధికి కీలకమైన రంగాలు- విద్య, ఆరోగ్య, ఆహార భద్రత, సామాజిక రంగాలలో నిర్వహణ బాధ్యతల నుండి ప్రభుత్వాలు వైదొలుగుతూ బడ్జెట్‌ను కుదిస్తున్నాయి. అంతేకాదు ఈ రంగాలన్నింటినీ ప్రైవేటుశక్తులకు అమ్మివేస్తున్నాయి. దీనివల్ల మహిళలకు గట్టి దెబ్బతగిలింది. ప్రైవేటీకరణ మహిళల పాలిట శాపంగా మారింది. త్రాగునీరు తీసుకువచ్చే బాధ్యత ఎక్కువభాగం మహిళలదే గనుక యమయాతనలు పడుతున్నారు. సంపాదించిన డబ్బును త్రాగునీరు కొనడానికి వెచ్చించాల్సి వస్తుంది. ఆహార భద్రత కొరవడింది. కావాలని ప్రభుత్వ (ఆహార ధాన్యాల) పంపిణీ వ్యవస్థను దెబ్బతీయడం వల్ల 13 రాష్ట్రాలలో ఆకలి చావులు సంభవించాయి. ఏదోవిధంగా ప్రాణాలు నిలుపుకోవాలన్న ఆశలు మహిళలను చివరకు పడుపువృత్తికి దారి తీయిస్తున్నాయి. మహిళలను ఇంతటి విషమ పరిస్థితుల్లోకి నెట్టడం ద్వారా మహిళా సాధికారతను ఈ ప్రభుత్వాలు సాధిస్తాయా? నూతన ఆర్థిక విధానాలు పేదరికాన్ని పెంచుతున్నాయి. జీవించే హక్కును కాలరాస్తున్నాయని ఈ విధానాల అమలు ఆపాలని పోరాడుతున్న మహిళలను ఖాతరు చేయని, వారి న్యాయమైన డిమాండ్స్ పట్ల స్పందన లేని (రాజకీయ పార్టీల) పాలక పార్టీల పట్ల ఖచ్చితమైన వైఖరిని ఈ ఎన్నికలల్లో మహిళలు ప్రదర్శించాలి.

ఇదిలా ఉండగా వ్యవస్థాగత సర్దుబాట్ల కార్యక్రమానికి సంబంధించిన నూతన ఆర్థిక విధానాల వల్ల ఆర్థిక రంగంలో మాత్రమే కాక ఎలక్ట్రానిక్ మీడియా ప్రైవేటుపరం కావడంతో సెక్స్ విశృంఖలతతో కూడిన అశ్లీల ప్రదర్శనలు, చిత్రీకరణలు విపరీతంగా పెరుగుతున్నాయి. మరోవైపు బాణామతి, దొంగబాబాలు, యితర సాంఘిక దురాచారాల వల్ల కుటుంబంలో సమాజంలో హింస పెరగడానికి కారణమవుతున్నాయి. దీని ఫలితమే మహిళలపై, పసిబాలికలపై ఆటవికంగా, అనాగరికంగా అత్యాచారాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ప్రతీ సం॥ 20శాతం ఈ అత్యాచారాలు పెరుగుతున్నాయి. జాతీయ నేరపరిశోధనా సంస్థ 2001 లెక్కల ప్రకారం ప్రతీ 30 నిమిషాలకు ఒక మానభంగం, ప్రతీ 42 నిమిషాలకు లైంగిక వేధింపులకు, ప్రతీ 43 నిమిషాలకు కిడ్నాప్, ప్రతీ 93 నిమిషాలకు ఒక హత్యకు మహిళలు గురవుతున్నారు. ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో మహిళలపై అత్యధిక సంఖ్యలో నేరాలు పెరుగుతున్నాయి. నేరపరిశోధనా శాఖ ప్రకటించిన వివరాల ప్రకారం అత్యాచారాలకు పాల్పడుతున్న నేరస్తులలో 99శాతం నేరస్తులు శిక్షనుండి తప్పించుకోగల్గుతున్నారు. 1 శాతం మాత్రమే శిక్షించబడుతున్నారు. విపరీతంగా పెరిగిపోతున్న అత్యాచారాలను కట్టుదిట్టంగా అరికట్టడానికి చర్యలు తీసుకోవడంలో 99 శాతం నేరస్తులు శిక్షనుండి తప్పించుకోవడానికి గల కారణాలను పరిశీలించి మహిళా చట్టాలలో సవరణలు చేయడంలో, అవసరమైతే నూతన చట్టాలను రూపొందించి దోషులను కఠినంగా శిక్షించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయి. అత్యాచారాలను అరికట్టడానికి నిబద్ధతతో దృష్టిని కేంద్రీకరించలేదు.

భ్రూణహత్యలు

(గర్భస్థ శిశువుల హత్యలు) 1000 మంది పురుషులకంటే 927 మంది స్త్రీలు వున్నారు, పంజాబ్‌లో 793 మహిళలు మాత్రమే వున్నారు. గర్భస్థ ఆడశిశువు హత్యలు విపరీతంగా జరుగుతున్నాయి. స్త్రీ, పురుష నిష్పత్తి పడిపోవడానికి ప్రధాన కారణం ఈ గర్భస్థ ఆడశిశువుల హత్యలే. గర్భస్థ అడశిశుహత్యలను నివారించే చట్టాన్ని అమలుచేయడంలో ప్రభుత్వాలు నామమాత్రపు శ్రద్ధ కూడా చూపడంలేదు. గడిచిన 4 సం॥లలో గర్భస్థ శిశువుల పరీక్ష చట్టాన్ని ఉల్లంఘించిన క్లినిక్‌లను ఈ ప్రభుత్వాలు ప్రాసిక్యూట్ చేసి దోషులను కఠినంగా శిక్షించిన దాఖలాలు లేవు. మహిళలు, పుట్టబోయే ఆడశిశువులు కూడా దారుణంగా వివక్షకు గురవుతున్నారు. గర్భస్థ ఆడశిశువులను తొలగించుకోవడంలో వివక్షతోపాటు పేదరికం కూడా ప్రధాన కారణం. మనదేశంలో చనిపోతున్న వారిలో 30 శాతం బాలబాలికలు పోషకాహార లోపం వల్ల చనిపోతున్నారు. వీరిలో బాలికలు ఎక్కువ సంఖ్యలో వుంటున్నారు. ప్రసూతి మరణాల రేటు ప్రపంచంలో మనదేశంలో ఎక్కువ. మధ్యప్రదేశ్‌లో ప్రతీ వెయ్యిమంది శిశువుల్లో అత్యధిక స్థాయిలో 98.3

మంది ఆడశిశువు మరణాలు సంభవిస్తున్నాయి. 80శాతం ఖర్చులను స్వంతంగా వైద్యం పొందడానికి మహిళలు భరిస్తున్నారు.

పేదరికం, నిరక్షరాస్యత, వివక్షత అంతులేని హింస, అత్యాచారాలు, బాల్యవివాహాలు, వీటితోపాటు మహిళల ఉనికిని దెబ్బతీస్తున్న ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల వెలువడిన రిపోర్ట్సు ప్రకారం మనదేశంలో 3 కోట్ల 70,00,000 మంది మహిళలు అంతర్ధానమయ్యారు. వీటన్నింటిని చూస్తూ స్వయంగా అనుభవిస్తున్న మహిళలుగా మహిళా వ్యతిరేక దృక్పథం కల్గిన ప్రభుత్వాల నిర్వాకాన్ని గల్లాపట్టి గద్దెదింపాల్సి ఉంది.

గడిచిన నాలుగున్నర సం॥ల్లో మతోన్మాదం విషకోరలుచాచి కరాళ నృత్యం చేసింది. మహిళల్లో భయాందోళనలను సృష్టించింది. మతోన్మాదుల పైశాచిక రాక్షసకృత్యాల వల్ల అభద్రతాభావానికి గురై బెస్ట్‌బేకరీ, షబానో కేసులలో బాధిత మహిళలు సాక్ష్యం చెప్పాల్సివచ్చినప్పుడు పడిన బాధ వర్ణించలేం. అత్యంత బాధాకరమైనది. సనాతన చాందస భావాల, మతశాసనాల ఆజ్ఞలకు లోబడి వుండే మహిళలు మరింతగా ఆ వలయంలో బందీలుగా మారడానికి వాతావరణాన్ని మతోన్మాదం సృష్టించింది నేడు.

గుజరాత్ దుస్సంఘటనల్లో మహిళలపై జరిగిన అత్యాచారాలు, అవమానాలు, కిరాతకమైన చర్యలకు అంతేలేదు. మానవత్వం లేని మతపిచ్చి తలకెక్కిన ఉన్మాదులు నిండుచూలాలన్న కనికరం లేకుండా గర్భాన్ని కత్తితో చీల్చి శిశువును బయటకు లాగి ముక్కలు ముక్కలుగా నరికారు. ఇలాంటి హృదయ విదారక సంఘటనలు అనేకం జరిగాయి. వీటిలో మహిళలు, మైనారిటీ మతాలకు చెందిన మహిళలు భయాందోళనలకు గురికావడంతో పాటు వారివారి మత సాంప్రదాయాలకు, శాసనాలకు మరింతగా బందీలై జీవితాలను విధిగా కొనసాగిస్తున్నారు. మతోన్మాదాన్ని, సనాతన ఛాందసవాదాలను ప్రచారంలోకి తీసుకురావడంతో రాజకీయ లబ్దిపొందడానికి చేస్తున్న ప్రయత్నంతోపాటు మధ్యయుగాల నాటి రాతియుగపు సమాజంలోకి మహిళలను నెట్టివేస్తున్నారు. మతోన్మాద శక్తుల పట్ల, వీరికి పూర్తి స్థాయిలో గులాంగిరి చేస్తున్న రాజకీయ పార్టీల పట్ల అప్రమత్తంగా వుండటమేకాదు ఈ ఎన్నికల్లో మతసామరస్యం కోసం పాటుపడుతున్న ప్రజాతంత్ర, ప్రజాస్వామిక శక్తులను గెలిపించడం ద్వారా మహిళల మానవ హక్కులను కాపాడుకోవడానికి మహిళలు సిద్ధంకావాలి.

పేదరికం, నిరక్షరాస్యత, వివక్షత అంతులేని హింస, అత్యాచారాలు, బాల్యవివాహాలు, వీటితోపాటు మహిళల ఉనికిని దెబ్బతీస్తున్న ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల వెలువడిన రిపోర్ట్సు ప్రకారం మనదేశంలో 3 కోట్ల 70,00,000 మంది మహిళలు అంతర్ధానమయ్యారు.

మన రాష్ట్రంలో సారా, మధ్యనిషేధ చట్టాలను మహిళలు అనేక పోరాటాలతో సాధించుకున్నారు. మధ్యనిషేధ ఫలాలను అనుభవించే మంచి పరిస్థితులను కాలరాస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిషేధాన్ని ఎత్తివేయడం సహించరానిది. సారా నిషేధాన్ని సహితం నీరుకార్చడానికి కాపుసారా వ్యాపారాన్ని అధికార పార్టీ ఎంఎల్‌ఎలు యదేచ్ఛగా చేస్తున్నా పట్టీపట్టనట్లు ముఖ్యమంత్రి వ్యవహరించారు. "సారాలేని సంసారాన్ని సాధ్యం చేసిందెవరు" అంటూ ఆర్భాటపు ప్రకటనలిచ్చుకున్న ప్రభుత్వం నేడు ఎక్సైజ్ ఆదాయంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పరిశీలిస్తే చిటికెడు పంచదార నేలమీద విసిరితే కన్నుమూసి తెరిచేలోపు లక్షలాది నల్లచీమలు గుమిగూడినట్లుగా కొద్దిపాటి తాత్కాలిక ప్రభుత్వ సహాయం ప్రకటించి లక్షలాది మంది మహిళలను భ్రమలలో ముంచి తేల్చడానికి ఈ పథకాలు వున్నాయి తప్ప మహిళల సంక్షేమం, అభివృద్ధి, సాధికారత సాధనకు దోహదపడే విధంగా ఈ పథకాలు లేవు. ప్రభుత్వ విధానాల వల్ల బ్రతుకుతెరువును కోల్పోయిన మహిళలు తమ జీవించే హక్కు కోసం చేయల్సిన పోరాట దృక్పథాన్ని పక్కదారి మళ్ళించడంలో భాగంగా ప్రపంచ బ్యాంక్ దేశవిదేశాలలో విస్తృతపరుస్తున్న మైక్రోక్రెడిట్‌ను మన రాష్ట్రంలో అమల్లో పెట్టి పొదుపు, డ్వాక్రా సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సమిష్టితత్వంలో జీవితావసరాలకు తీర్చుకొనే ఉద్దేశంతోపాటు, సాంఘిక న్యాయం కోసం గ్రామస్థాయిలో ఉద్యమించాలనే లక్ష్యాలుండాల్సిన మహిళా పొదుపు సంఘాల్లో పోరాటాలను హైజాక్ చేసి, కేవలం పొదుపు చేసి అప్పులు ఇచ్చిపుచ్చుకునే మేరకే పరిమితం చేసి ప్రభుత్వం తన అధీనంలో పొదుపు సంఘాలను కొనసాగిస్తూ మహిళా పోరాట చైతన్యాన్ని నిర్వీర్యపరుస్తుంది.

మరొకవైపు హిందుస్తాన్ లీవర్ లిమిటెడ్ కంపెనీ వస్తువులను 13శాతం లాభాలకు పొదుపు మహిళలతో గ్రామాల్లో అమ్మిస్తూ బహుళజాతి కంపెనీలకు ఏజెంట్స్‌గా మార్చారు. బహుళజాతి కంపెనీలకు మార్కెటింగ్ అవకాశాలను పెంచుతున్నారు. డ్వాక్రా పొదుపు సంఘాలపై ప్రభుత్వం అదుపు, ఆధిపత్యం మహిళా సాధికారతకు గొడ్డలిపెట్టుగా పరిణమించింది. పొదుపు డ్వాక్రా మహిళలను ముఖ్యమంత్రి సభలకు తరలించడానికి చూపిస్తున్న శ్రద్ధ వారి సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపలేదు.

మహిళా సంఘాలు పొదుపు, డ్వాక్రా మహిళల స్థితిగతులపై సర్వేచేసి అనేక వాస్తవాలను వెలుగులోకి తెచ్చాయి. వాస్తవాలను అర్థం చేసుకున్న పొదుపు, డ్వాక్రా మహిళలు ఆగ్రహంతో వున్నారు. ఇంకా వాస్తవాలను తెలియని పొదుపు మహిళలు ఆశల పురిలోనే ఉన్నారు. పొదుపు, డ్వాక్రా మహిళల్లో అక్షరాస్యత ఏమైనా పెరిగిందా అంటే అదీలేదు. అర్థమైన వాస్తవాల ఆధారంగా దారుణమైన మోసాలకు వడిగట్టిన పాలకుల అంతుతేల్చడానికి పొదుపు డ్వాక్రా మహిళలు సిద్ధం కావాలి. మోసాలను పటాపంచలు చేయడానికి దగాలను, ద్రోహాలను బద్దలు చేయడానికి మన ఓటును సద్వినియోగం చేసుకుందాం. ఓటు అంకుశం లాంటిదని నిరూపిద్దాం. ○

ఆరోపణల్లో వెల్లడైన నిజం

నక్సల్స్ విషయంలో 'దేశం' పార్టీ విధానం తప్పు

- ఇప్పు వీరారెడ్డి

ఎన్నికలు దగ్గర పడుతున్న సందర్భంలో తెలుగుదేశం తన 22వ జన్మదిన వేడుకుల సందర్భంగా 'తీవ్రవాదం - ప్రగతికి శాపం' పేరుతో విడుదల చేసిన కరపత్రం ద్వారా నక్సలిజంపై తన అశాస్త్రీయ విధానాన్ని మరోసారి పునరుద్ఘాటించింది. (పునరుద్ఘాటించిందనడం కంటే 'దాడి' చేసిందనడమే కరెక్ట్‌గా ఉంటుందేమో) తమ ఎన్నికల ఎజెండా నుండి నక్సల్స్ అంశాన్ని విరమించుకోలేదని తద్వారా స్పష్టం చేసింది.

తమ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల వారి జీవితాల్లో వెలుగులు విరబూయించేందుకు కంకణబద్ధమై అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే రాష్ట్రంలో అశాంతి, అభద్రతను పెంచుతున్న తీవ్రవాదం అభివృద్ధికి తీవ్ర అవరోధంగా ఉందంటూ, తెలంగాణ వెనుకబాటు తనానికి తీవ్రవాద శక్తుల దుర్మార్గాలే ప్రధాన కారణమంటూ అసంబద్ధమైన అసత్య ఆరోపణలతో విరుచుకుపడింది. 'వర్గశత్రువులంటూ సామాన్య ప్రజలను చంపుతున్నార'ని ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారం'టూ, గతంలో ఎప్పటి నుండో వినిపిస్తున్న పాత పురాణాన్ని ఏకరువు పెట్టింది. తన మిత్రపక్షాలపై నక్సలైట్లు చేస్తున్న దాడులను ఖండించకపోవడం విపక్షాల దివాళాకోరుతనమని'ని, 'తీవ్రవాదులు ప్రతిపక్షాలకు తొత్తులుగా మరార'ని, ఇటు నక్సలైట్లపై, అటు విపక్షాలపై శాపనార్థాలతో దుమ్మెత్తి పోసింది. నక్సలిజం పుట్టుక-వ్యాప్తి- తీవ్రతలో కాంగ్రెస్ పార్టీ పాత్రను రుజువు చేసే ప్రయత్నంలో ఎంతో తెలివైన వాదనలను చేశానని భావిస్తున్న తెలుగుదేశం పార్టీ, తనకు తెలియకుండానే నక్సల్స్ సమస్య పట్ల తనవలంభిస్తున్న ప్రస్తుత వైఖరి తప్పుడు విధానమనే విషయాన్ని అప్రకటితంగా వెల్లడి చేసింది. రాష్ట్రంలో చేయిదాటిపోతున్న పరిస్థితులను చక్కదిద్దాలనే (ఆ ప్రయత్నంలో ఉన్నట్లు చెప్పుకుంటుంది) పట్టుదల గనుక ఉంటే ఆంధ్రప్రదేశ్ ఉజ్వలంగా పురోగమించాలన్నదే తమ ధ్యేయమని ప్రకటించుకున్న తెలుగుదేశం పార్టీ నక్సల్స్ సమస్య పట్ల తానవలంభిస్తున్న ప్రస్తుత విధానాన్ని నిజాయితీగా పునఃసమీక్షించుకోవాల్సి ఉంది.

> 1969-70ల్లో రాష్ట్రంలో ప్రారంభమైన ఉద్యమానికి ముందు ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ 1957 నుండి అధికారంలో (13 సంవత్సరాల పాటు) కొనసాగిన పాలక పార్టీలు ఎప్పటి నుండో వస్తున్న సామాజిక-ఆర్థిక అసమానతలను, భూస్వామ్య దోపిడీ పీడనలను తగ్గించే విధానాన్ని తమ ప్రభుత్వ విధానంలో ప్రధానం చేయకపోవడంతో నక్సలైట్ ఉద్యమ పురుడుకు కారణమయ్యారు.

'కాంగ్రెసు ఏలుబడిలోనే రాష్ట్రంలో నక్సలిజం పుట్టిందని, మొదటగా ఆ పార్టీని నిషేధించిన ఘనత వారిదేన'ని నక్సలిజం పుట్టినప్పటి నుంచి చక్రం తిప్పిన 8 మంది కాంగ్రెస్ ముఖ్యమంత్రులు సమస్య పరిష్కారంలో చర్చల ప్రస్తావనే లేకుండా అందుకు భిన్నంగా అణచివేత - ఉక్కుపాదాన్నే మోపారనేది, తెలుగుదేశం పార్టీ చేస్తున్న ప్రధాన ఆరోపణ.

నిజమే, కాంగ్రెస్ పాలనలోనే నక్సలిజం రాష్ట్రంలో ప్రారంభం కావచ్చు. అదొక చారిత్రక నేపథ్యం. కాని కాంగ్రెసు పాలనలోనే ప్రారంభించాలని కొందరు నక్సల్స్ పెద్ద తలకాయలు ముందే అనుకొని ఉద్యమాన్ని ప్రారంభించలేదు. అంతకుపూర్వం కొన్ని దశాబ్దాలుగా అమలవుతూ వస్తున్న భూస్వామ్య దోపిడి, పీడన, అణచివేతలతో పాటు, కులవివక్ష, సామాజిక కట్టుబాట్లు లాంటి పలు సామాజిక ఆర్థిక అసమానతల నేపథ్యంలో అది ఈ రాష్ట్రంలో ప్రారంభమయ్యే సమయానికి కాంగ్రెస్ అధికారంలో ఉండడం అన్నది కేవలం యాదృచ్ఛికం. అట్లా కాదనుకుంటే, కేవలం ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణా జిల్లాలకే పరిమితమైన నాటి నక్సలైట్ కార్యకలాపాలు ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా (మరీ ముఖ్యంగా రాయలసీమ, కోస్తా ఆంధ్రాల్లో) విస్తరించడానికి తెలుగుదేశం పార్టీనే బాధ్యురాలిని చేయాల్సి వుంది. ఒప్పుకుంటారా మరి? ఇక్కడ సామాజికార్థిక అసమానతల పునాదితో పురుడు పోసుకుంటున్న ఉద్యమాలకు పాలక పార్టీల బాధ్యతను తోసివుచ్చడం కాదు ఉద్దేశం. 1969-70ల్లో రాష్ట్రంలో ప్రారంభమైన ఉద్యమానికి ముందు ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ 1957 నుండి అధికారంలో (13 సంవత్సరాల పాటు) కొనసాగిన పాలక పార్టీలు ఎప్పటి నుండో వస్తున్న సామాజిక-ఆర్థిక అసమానతలను, భూస్వామ్య దోపిడీ పీడనలను తగ్గించే విధానాన్ని తమ ప్రభుత్వ విధానంలో ప్రధానం చేయకపోవడంతో నక్సలైట్ ఉద్యమ పురుడుకు కారణమయ్యారు. నాటి ప్రభుత్వాల 'హయాం' అంతా కాంగ్రెస్ పార్టీదే కాబట్టి ఆ పాపం అంతా వాళ్ళదే అంటూ ప్రస్తుత తెలుగుదేశం పార్టీలాంటి వారెవరైనా వాదన చెయ్యదలిస్తే, ఒక్క వామపక్ష పార్టీలు మినహా మిగతా పాలక పార్టీల జన్మస్థలం కాంగ్రెస్ పార్టీయే కదా! ఎవరో ఎందుకు తెలుగుదేశం పార్టీలో తిరుగులేని నేతగా వెలుగొందుతున్న చంద్రబాబే అందుకు తాజా ఉదాహరణ. అలాంటప్పుడు ఆ సమస్య పుట్టుకలో 'తిలాపాపం తలాపిడికెడు'గా ఎందుకు భావించకూడదు? కాబట్టి సామాజికార్థిక అసమానతల నేపథ్యంలో పుట్టిన ఉద్యమానికి జనరల్‌గా పాలక పార్టీలందరిదీ కాస్తా అటు ఇటుగా సమాన బాధ్యతే. ఇది కూడా చర్చించాల్సిన విషయమే అయినా దీనితో పాటు చర్చించాల్సిన విషయం మరొకటుంది. ఉద్యమాన్ని, దాన్ని ప్రారంభాన్ని ఎవరు ఏ విధంగా అర్థం చేసుకుంటున్నారు? దాని విస్తృతి-తీవ్రతను తగ్గించడంలో ఎవరు ఏ విధానాన్ని అవలంభిస్తున్నారు? ఆ విధానాల ఫలితాలెలా వస్తున్నాయి?

ఇప్పుడు మాట్లాడుతున్న సమయానికి ఆ సమస్యను పరిష్కరించడానికి ఎవరికెంత సమయం దొరికింది? లాంటి ప్రధానాంశాలను చర్చించాల్సి వుంది.

నక్సలైట్ ఉద్యమానికి దాదాపుగా 35 ఏళ్ళ లోపు వయస్సు. (వందల వేల ఏళ్ళ వయస్సున్న దోపిడి సామాజిక వ్యవస్థతో పోలిస్తే పసివయసు, (ప్రాకే వయస్సు) తెలుగుదేశం పార్టీ వయస్సు 22 ఏళ్ళు. ఇందులో ఐదు సంవత్సరాలు మాత్రమే అధికారంలో లేరనుకుంటే మిగతా 17 ఏళ్ళకు కొన్ని నెలలు మించే అధికారాన్ని చెలాయించారు. అంటే నక్సలైట్ ఉద్యమ సమస్యను పరిష్కరించేందుకు ఉద్యమం వయస్సుతో పోలిస్తే సగానికి పైగానే కాలం చిక్కింది. పోతే కాంగ్రెస్ పార్టీ వారికి కూడా సమస్య పరిష్కారానికి 17 ఏళ్ళ సమయం దొరికినట్టు కనబడుతుంది. అయితే నక్సలైట్ ఉద్యమానికి ప్రారంభ దినాల్లో ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉందని సాక్షాత్తు తెలుగుదేశం పార్టీయో ఒప్పుకుంటుంది. రానురాను (ఇది 'దేశం' పార్టీ కొనసాగించిన మొత్తం అధికారం కాలంలో పూర్వార్థ భాగం నుండి కావచ్చు) నక్సలైట్లకు నిజమైన సిద్ధాంతమన్నదే లేకుండా పోయిందని, నక్సలైట్లకు ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని మాట్లాడుతుంది. ఈ వాదన ప్రకారమే చూసినా ఉద్యమ ప్రారంభ దినాల్లో నక్సలైట్లను ప్రజల నుండి వేరు చేయడం అన్నది నాటి కాంగ్రెస్ పార్టీకి ఎంతో అసాధ్యమైన విషయం. తామవలంభించే అభివృద్ధి సంక్షేమ పథకాల కారణంగా నక్సలైట్ల నుండి ప్రజలు వేరైపోవడం, అదే సమయంలో నక్సలైట్లు అరాచకవాదులుగా తయారయ్యారని అంటుంది కాబట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే అవకాశం కాంగ్రెస్ పార్టీ కంటే తెలుగుదేశం పార్టీకే ఎక్కువగా దొరికి ఉండాలి. అలాంటప్పుడు నక్సలైట్ ఉద్యమంలో విస్తృతి-తీవ్రతలు గతానికి - నేటికి పోల్చినపుడు తగ్గిపోవాలి. కానీ వాస్తవం అలా వుందా? తలకాయ వుండి అందులో మెదడనేది వున్న ఏ ఒక్కరైనా చెప్పే జవాబు తెలుగుదేశం పార్టీ వారికి నచ్చకపోవచ్చు!

ఇదిలా ఉండగా రాష్ట్రంలో నక్సలైట్ ఉద్యమ ప్రారంభం నుండి చెన్నారెడ్డి వరకు పని చేసిన కాంగ్రెస్ ముఖ్యమంత్రులందరూ నక్సల్స్ సమస్యను సామాజిక-ఆర్థిక సమస్యగా భావించడానికి బదులు శాంతి భద్రతల సమస్యగానే భావించారని, ఇప్పుడేమో తమ ప్రభుత్వాన్ని నక్సలైట్లతో చర్చలను జరపాలని డిమాండు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ ఉక్రోష వ్యాఖ్యలు చేస్తుంది (కాంగ్రెస్ పార్టీ విధానమే తమకు ఆదర్శమా!) నిజమే, అందులో సందేహం లేదు. అట్లా చూశారు కాబట్టే, ఆ విధానాన్ని అవలంభిచారు కాబట్టే సమస్యను పరిష్కరించలేకపోయారు. అయినా కాంగ్రెస్ పార్టీ నక్సలైట్ సమస్యను ఎప్పటికీ శాంతిభద్రతల సమస్యగానే పరిగణించాలనే షరతుకు కట్టుబడి ఉండాలా? గతంలో అవలంభించిన విధానాన్ని పునఃసమీక్షించుకోకూడదా? గత విధానాలు తప్పుడు ఫలితాలిచ్చాయని, కాంగ్రెస్ భావించడం గాని, (పైకి ప్రకటించుకున్నా) సమస్య పరిష్కారానికి చర్చలే ప్రధానమని సూచించడంగానీ పొరపాటెలా అవుతుంది? పైగా కాంగ్రెస్ పార్టీ తన విధానంతో గోటితో పోయే దాన్ని గొడ్డలికి కూడా లొంగనిదిగా తీర్చిదిద్దిందని, సాక్షాత్తు 'దేశం' పార్టీ వారే స్వయంగా ఆరోపిస్తున్నారు కదా! ఏమిటి దీనర్థం? సమస్య పరిష్కారంలో నాటి కాంగ్రెస్ అవలంబించిన అణచివేత విధానాలే సమస్య తీవ్రతకు కారణమయ్యాయని, ఈ రోజు ఎంతగా అణచివేత విధానాలు (గొడ్డలి విధానాలు) అవలంబించినా సమస్య పరిష్కారమవ్వడం లేదనే కదా దీనర్థం? అయినప్పుడు అణచివేత- ఉక్కుపాదంలాంటి అనాగరిక అశాస్త్రీయ విధానాల్ని మరో ప్రశ్నే లేకుండా వదిలిపెట్టాలి కదా? మరి తెలుగుదేశం పార్టీ అవలంబిస్తున్న విధానమేమిటి?

ప్రస్తుత సమస్యను పరిష్కరించడానికి చర్చలు మినహా మార్గమే లేదంటున్న కాంగ్రెసు పార్టీ గత అనుభవాల దృష్ట్యా చేస్తున్న సూచనపై విరుచుకుపడడం, విమర్శించబూనడం విజ్ఞతనిపించుకోదు. నిజానికి నక్సలైట్ సమస్య పరిష్కారానికి శాంతిభద్రతల కోణం పనికిరాదని, దానికి సామాజిక, ఆర్థిక కోణం శాంతిచర్చలే పరిష్కార మార్గాలని విపక్షాలో, మేధావులో, వేరొకరెవరో సూచన చేయాల్సిన అవసరమే లేదు. ఆ విషయాన్ని తెలుగుదేశం పాలనకు ముందటి కాంగ్రెసు పాలనే రుజువు చేసింది. అది తెలుగుదేశం పార్టీ కాంగ్రెసు మీద చేస్తున్న వాదనల్లోనే బయటపడిపోయింది.

నక్సలైట్ సమస్య పరిష్కారంలో తనకిష్టంలేని చర్చల ప్రస్తావనను సమర్థించుకోవడానికి తెలుగుదేశం పార్టీ 'నక్సలైట్ల నాయకులెవరు? వారి డిమాండ్లేమిటి? అసలు చర్చలు జరపాలంటే ఎవరితో జరపాలి? ప్రభుత్వంతో చర్చించడానికి నాయకుడు వారిలో ఉన్నాడా?' అంటూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య చేసినట్టు చెబుతున్న వాఖ్యానాల్ని ఎత్తిచూపుతుంది. సాధారణ స్థాయి నాయకుడెవరూ, ఏ పార్టీకి చెందినవాడైనా (ఆఖరికి తెదే పార్టీ వాడైనా) ఇంతటి అమాయకమైన తక్కువ స్థాయి ప్రశ్నలను వేయరు కావచ్చు! నిజంగా ఆ వ్యాఖ్యలను బుద్ధదేవ్ భట్టాచార్య లాంటి ప్రముఖ కమ్యూనిస్టు నేత, ఒక రాష్ట్ర సారధి ఆ వ్యాఖ్యానాన్ని చేసివుంటే తెలుగుదేశం పార్టీ వారు తమ వాదనకు సపోర్టుగానూ, ప్రమాణంగానూ చేసుకోవాల్సిన అవసరం లేనేలేదు. ఆ వ్యాఖ్యానాలెవరు చేసినా నిర్ద్వంద్వంగా తోసిపుచ్చదగినవే.

> నక్సలైట్ సమస్య పరిష్కారానికి శాంతిభద్రతల కోణం పనికిరాదని, దానికి సామాజిక, ఆర్థిక కోణం శాంతిచర్చలే పరిష్కార మార్గాలని విపక్షాలో, మేధావులో, వేరొకరెవరో సూచన చేయాల్సిన అవసరమే లేదు. ఆ విషయాన్ని తెలుగుదేశం పాలనకు ముందటి కాంగ్రెసు పాలనే రుజువు చేసింది.

తన కిష్టంలేని చర్చల ప్రస్తావనను ప్రముఖుల వ్యాఖ్యానాలతో సమర్థించుకోవాలనుకుంటే, నక్సలైట్ సమస్యకు అత్యున్నత పరిష్కారమార్గం చర్చలేనని భారత అటార్నీ జనరల్ సోలీ సొరాబ్జి, మాజీ సిబిఐ డైరెక్టర్ కార్తికేయన్, మాజీ కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత నాగా సమస్య పరిష్కార బాధ్యతలు పర్యవేక్షిస్తున్న పద్మనాభయ్యలతోపాటు తెలుగుదేశానికి అత్యంత ప్రీతిపాత్రమైన 'లోక్‌సత్తా' నాయకుడు జయప్రకాశ్ నారాయణ్‌లాంటి ప్రముఖులెందరో చేస్తున్న వ్యాఖ్యానాల్ని ఎందుకు ప్రమాణంగా తీసుకోవడం లేదో తెలుగుదేశంపార్టీ జవాబు చెప్పాల్సి ఉంది. ○

సామ్రాజ్యవాద దోపిడీకి మరోపేరే 'ప్రపంచీకరణ'

- వి. హనుమంతరావు

తెల్లవారి లేస్తే కమ్యూనిస్టులకు ప్రపంచీకరణ, ప్రపంచ బ్యాంకు తప్ప మరేమీ కనుపించదు కాబోలు ఇందుగలడందు లేడన్నట్లు దేశంలో ప్రతీ పరిణామాన్ని ప్రపంచీకరణకు, ప్రపంచ బ్యాంకుకు ముడిపెడతారు. ఆఖరుకు ఎక్కడో కుగ్రామంలో పొలం దున్నుకునే రైతుకు, కూలిపని చేసుకునే వ్యవసాయ కూలీకి ఒక పక్క, రాష్ట్రాన్ని పరిపాలించే తెలుగుదేశాన్ని, ఒక పక్క ప్రపంచీకరణతో లింకు పెడతారు. దుక్కిటెద్దును తోలే చిన్నరైతుకు, ప్రపంచ బ్యాంకుకు సంబంధమేమిటి? సంబంధాలనేవి కొన్ని బయటకు కనపడవు. పురుషుడికి భార్యతో సంబంధం కనపడేది; పరస్త్రీతో సంబంధం కనపడనిది. శాసనసభ్యులు, మంత్రులు అంతా పెద్దమనుషులే, వారంతా పేదల కోసం కడవలతో కన్నీరు కారుస్తుంటారు. ఇది మనకు కనపడేది. ఇపుడు ఎన్నికల సందర్భంగా వాళ్ళకున్న ఆస్తుల గురించిన ప్రకటనలు చదువుతూంటే, ఈ లక్షాధికారులు, కోటీశ్వరులేనా మనకు ప్రాతినిధ్యం వహించేది? ఇది ఇప్పటివరకూ కనుపించనిది. అలాగే ప్రపంచీకరణ, ప్రపంచ బ్యాంకుకు గ్రామీణ ప్రజలకు కనపడని సంబంధముంది. ఉదాహరణకు రైతు కొనుక్కునే ఎరువులకిచ్చే సబ్సిడీ తగ్గించాలంటే, అది ప్రపంచ బ్యాంకు షరతు మేరకు తగ్గించింది ప్రభుత్వం. రెండు రూపాయల కిలో బియ్యం, ఆరు రూపాయలకు పెరిగిందంటే, అది బ్యాంకు ఆజ్ఞ మేరకు జరిగిందే. తిండిగింజల పంట తగ్గించండి, వ్యాపార పంటలు పండించండి అని ప్రభుత్వం అంటూందంటే దాని వెనకాల బ్యాంకు హస్తం ఉంది. నీటితీరువా పెరిగిందంటే, వ్యవసాయ ఉత్పత్తులు ధారాళంగా దిగుమతి అవుతున్నాయంటే, ఆఖరుకు మన చవక దుకాణాల వ్యవస్థను నడిపించే ఫుడ్ కార్పొరేషన్‌ను మూసివేసే ప్రయత్నం జరుగుతోందంటే, అదీ బ్యాంకు ఆదేశమే. శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదని పూర్వుల సామెత. ప్రపంచ బ్యాంకుకు తెలియకుండా రాష్ట్రంలో, దేశంలో ఏమీ జరగడానికి వీల్లేదు. ఈ ఆదేశాలన్నీ వాజ్‌పేయి ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయవిధాన పత్రంలో చోటుచేసుకున్నాయి. ప్రపంచాన్నంతటినీ, అన్ని దేశాలను తమ పాదాక్రాంతం చేసుకోవటానికి సిగ్గూ, శరం లేకుండా, న్యాయం అన్యాయం అని చూడకుండా పేట్రేగుతున్న బహుళజాతి సంస్థల అండగా అమెరికా దన్నుతో నడుస్తున్న ప్రపంచ బ్యాంకు షరతులన్నిటినీ తన ప్రభుత్వ విధానాలేనని నిస్సిగ్గుగా చెప్పుకుంటున్న ప్రధాని వాజ్‌పేయిని ఏమనాలో తోచకుండా ఉంది. సామ్రాజ్యవాదులను మెడపట్టి గెంటిన మన దేశాన్ని అదే సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్లేలా వాజ్‌పేయి ప్రవరిస్తున్నారు.

అసలీ సామ్రాజ్యవాదమనేది ఒక మేక వన్నె పులి. 1947లో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అధికారాన్ని నల్లదొరల చేతుల్లో పెట్టి వెళ్లిపోలేదు. మరోరూపంలో దేశంలో మళ్లా కాలుపెట్టారు. స్వతంత్ర్యం రావటం, దేశవిభజన, మతకల్లోలాలతో అసలే సామ్రాజ్యవాదుల 200 సంవత్సరాల దోపిడీకి గురైవున్న దేశం ఆర్థికస్థితి మరింత చిన్నాభిన్నమైంది. ముఖ్యంగా గ్రామసీమలు తల్లడిల్లిపోయాయి. ఇదే అదనుగా చూచుకొని "సహాయం" పేరుతో అమెరికా సామ్రాజ్యవాదం ఫోర్డ్ ఫౌండేషన్ ముసుగులో దేశంలో కాలుపెట్టింది. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం పేరుతో గ్రామసీమల్లో ప్రవేశించింది. ఇది 1952లో జరిగితే మరో రెండు సంవత్సరాల్లోనే దేశంలో తిండిగింజల కొరతను సాకుగా తీసుకుని పిఎల్ 480 పేరుతో అమెరికా తిండి గింజలను మన దేశంలోకి దిగుమతి చేసింది. మామూలుగా విదేశాలనుంచి ఏమి తెచ్చుకున్నా వాటి మూల్యం డాలర్లలోనే చెల్లించాలి. అలాంటిది, మీరు డాలర్లలో చెల్లించనక్కర్లేదు, మీ రూపాయల్లోనే చెల్లిస్తే చాలు, ఆ డబ్బు కూడా మాకు తిరిగి చెల్లించనక్కర్లేదు, మీ దేశంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించుకోండి అని ఎంతో ఔదార్యాన్ని నటించింది. ఈ దాతృత్వం వెనుక రెండు స్వలాభాలు ఇమిడి ఉన్నాయి. 1) అమెరికాలో తిండి గింజల నిల్వలు మేటలు వేసుకుని వున్నాయి. వాటిని ఎలా వదిలించుకోవాలో తెలియని పరిస్థితి. అమెరికా ప్రభుత్వం ఆ తిండిగింజలను తీసుకుని వెళ్లి సముద్రంలోనైనా కలిపేస్తుంది, కాని ధరలు తగ్గించదు. అది అమెరికా పాలకుల నైజం. కాగా ఈ గింజలను తన లాభాలకు వినియోగించాలి. ఇదే కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి పునాదివేసింది. 2) ఈ కార్యక్రమం అమలుపరచడానికి నిధులు కావాలి. గ్రామాల్లో రోడ్లు వేయటం, కాల్వలు తవ్వటం, ఇతర గ్రామీణ సౌకర్యాలను ఏర్పాటు చేయటమే ఈ కార్యక్రమం. కొంతమేరకు ఈ పనులు చేయడానికి ప్రజల్ని శ్రమదానం చేయమనండి. మిగతా దానికి ఈ

> ఈ రోజున ఆసియా దేశాలు, మనకన్నా ఎంతో ముందున్నాయంటే, దానికి భూసంస్కరణల అమలు, విద్య వైద్యంపై కేంద్రీకరించి ఆ కార్యక్రమాన్ని పూర్తి చేయటమే ప్రధాన కారణం అని నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ అన్న విషయం గుర్తుంచుకుంటే, మన దేశంలో వ్యవసాయం ప్రస్తుత దుస్థితిలో ఎందుకున్నదో విదితమవుతుంది. తద్భిన్నం పెట్టినట్లు భూసంస్కరణలను అమలుజరపటం తప్ప, గ్రామీణ జీవితంలో సంస్థాగత మార్పును తీసుకుని రాలేకపోయింది. ఆ మార్పు రాకపోగా, సస్యవిప్లవం పుణ్యమా అంటూ భూకామందులు మరింత ధనవంతులవ్వటం, చిన్న సన్నకారు రైతులకు భూకామందులకు మధ్య అంతరం పెరగటం, పేదరికం పెరగటం జరిగింది.

తిండిగింజల అమ్మకం ద్వారా వచ్చిన నిధులను ఉపయోగించుకోండి. సహాయం చేస్తున్నట్లే నటిస్తూ, దేశంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి సాయపడడమే తమ లక్ష్యమన్నట్లు పోజుపెట్టింది. కాని, ఈ మాయవేషంలో మన ఆర్థిక వ్యవస్థ మీద ఎత పట్టు సంపాదించిందంటే, 60వ దశకం ప్రారంభం నాటికి మన దేశంలో బలీయంగా అవుతున్న డబ్బులో అయిదోవంతు అమెరికా డబ్బే. ఆ విధంగా సహాయం పేరుతో మన ఆర్థిక వ్యవస్త మీద పరోక్షంగా పట్టు సంపాదించింది. రాజకీయ పరిభాషలో చెప్పాలంటే సామ్రాజ్యవాదం నేరుగా పరిపాలించకుండా పరోక్షంగా, మన ద్రవ్య పరిస్థితి మీద పట్టు సంపాదించింది. అమెరికా ఇదే విధానాన్ని అనేక దేశాల్లో అనుసరించటంతో, ఈ కుట్రను పసిగట్టిన వర్ధమాన దేశాలు ప్రపంచమంతటా నిరసన తెలియ చేయటంతో, ఆ పథకాన్నయితే ఉపసంహరించింది కాని, ఆ డబ్బు మాత్రం మన దేశంలోనే ఉండిపోయింది. ఈ డబ్బుతో అమెరికా రాజకీయవేత్తలను, మేథావులను, బ్యురాక్రాట్లను వారి ఆలోచనలను ప్రభావితం చేయడానికి వినియోగించింది. చాపకింద నీరులా మన ఆర్థికస్థితి పైన, మన ఆలోచనలను ప్రభావితం చేస్తూ వచ్చింది. పైకి సహాయం చేస్తున్నట్లే కనిపిస్తూ, లోలోపల గోతులు తవ్వటం అంటే ఇదే.

అదే దశకంలో పిఎల్ 480 ఉపసంహరించినా, రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ అనే మరో అమెరికన్ సంస్థ సహాయం మాటున, అమెరికా తన కార్యకలాపాలను కొనసాగించింది. దీని ఫలితమే దేశంలో సస్యవిప్లవం (గ్రీన్ రివల్యూషన్). ఈ సస్యవిప్లవానికి, అధిక పంట దిగుబడి విత్తనాలు, మస్తుగా ఎరువులుగా, పురుగుల మందులు అవసరం అనేది మన రైతాంగానికి తెలిసిన విషయమే. అవి మన దేశంలో ఉత్పత్తి కావటంలేదు. అపుడెప్పుడో బీహార్‌లోని సింద్రీ అనే చోట ఒక ఎరువుల ఫ్యాక్టరీని స్థాపించారు. అది చేసే ఉత్పత్తి ఒక పంటికిందకు కూడా సరిపోదు. దిగుమతి చేసుకోవాలి. ఇవి తయారు చేసే అమెరికన్ కంపెనీలు గద్దల్లా దేశంమీద వాలాయి. అధిక దిగుబడి విత్తనాలు పంటను ఇబ్బడిముబ్బడిగా పెంచాయి. ధనిక రైతులు, భూస్వాములు ఎగబడ్డారు. మనకు తిండిగింజలు ఎక్కువగా పండితే, అమెరికా కంపెనీలు లాభాలు పండించుకున్నాయి. ఈ కార్యక్రమం అంతా ప్రపంచబ్యాంకు ఆధ్వర్యంలో జరిగింది. ప్రారంభంలో ఈ సస్యవిప్లవం భూస్వామ్య, ధనిక రైతువర్గాలకు వరప్రసాదమైంది. రెండో పక్క గ్రామీణ మార్కెట్లను చేజిక్కించుకోవడానికి అమెరికా కంపెనీలకు అవకాశం లభించింది. సామ్రాజ్యవాదం లక్షణం బానిస దేశాలను దోపిడీ చేసి తమ పట్టును కొనసాగించుకోవటం. ఈ నూతన పరిస్థితుల్లో బానిస దేశాలమీద నేరుగా అధికారం చెలాయించనవసరం లేదు. తమ చేతికి మట్టి అంటకుండా, తన ప్రయోజనాలను, అంటే దోపిడీని కనపడని రీతిలో, అంటే బ్యురాక్రట్లు, రాజకీయ నాయకుల ద్వారా కాపాడుకుంటూ, పెంచుకుంటూ వచ్చింది. దేశంలో అమెరికన్ లాబీ తయారైంది. "చూచారా? అమెరికా ఎంత గొప్ప దేశమో, ఎంత ఉదారంగా మనకు సహాయం చేస్తోందో" అని అమెరికా ఏజెంట్లు ప్రచారం చేశారు. సామ్రాజ్యవాదులు పోయారు కాని సామ్రాజ్యవాదం మిగిలింది. ఆనాడు ఫోర్డ్ ఫౌండేషన్‌ను గాని, ఆ తర్వాత రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్‌ను గాని నెహ్రూయే ఆహ్వానించారని ఒక అభిప్రాయం వుండేది. పైనే చెప్పినట్లు తిండిగింజల ఉత్పత్తి కేవలం పది సంవత్సరాల్లో ఎంతమేరకు పెరిగిందంటే మన దేశం దిగుమతుల మీద ఆధారపడే దుస్థితి తొలగింది. ఈనాడు ఎగుమతి చేయగలిగే స్థితిలో ఉంది. (అయితే, దేశంలో ప్రతి నలుగురిలో ఒకరిని పేదరికపు రేఖ కింద వుంటూ, ఒక పూట తింటే మరొకపూట తినక, ఆకలి మరణాలది వేరే కథ) కాని మరోవైపు 1981 నాటికే తిండిగింజల ఉత్పత్తి మూడు రెట్లు పెరిగితే, ఎరువుల అవసరం రెట్టింపైంది. అంతమేరకు ఎరువులు దేశంలో ఉత్పత్తి జరగకపోవటంతో ఈనాటికి మనం ఎరువుల దిగుమతుల మీదే ఆధారపడాల్సి వస్తుంది. ఇది వరకు తిండిగింజల దిగుమతి మీద, ఇపుడు ఎరువులు, పురుగుమందుల కోసం దిగుమతుల మీద ఆధారపడాల్సి వస్తుంది. కాలికి వేస్తే మెడకు, మెడకు వేస్తే కాలికి వేసే సామ్రాజ్యవాద ఎత్తులంటే ఇవే.

స్వాతంత్రోద్యమ కాలంలో వ్యవసాయం సంక్షోభంలో వుండటానికి భూసంస్కరణలు అమలుపరచకపోవటమే కారణమని, స్వతంత్ర భారతంలో భూసంస్కరణలు ప్రవేశపెట్టి రైతుల జీవితల్లో వెలుగు నింపుతామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికార పీఠం అధిష్టించిన తర్వాత సంస్కరణలు అమలుపరుస్తామని ప్రణాళికలో చెపుతూ ఆచరణలో సంస్కరణలను కాగితాలకే పరిమితం చేసి, టెక్నాలజీ ద్వారానే అధిక దిగుబడులను సాధించే మార్గం చేపట్టింది. వ్యవసాయక దేశమైనా భారతదేశంలో ఆర్థికాభివృద్ధికి వ్యవసాయాన్ని సంస్కరించటమే మూలం. ఈ రోజున ఆసియా దేశాలు, (ముఖ్యంగా చైనా) మనకన్నా ఎంతో ముందున్నాయంటే, దానికి భూసంస్కరణల అమలు, విద్య, వైద్యంపై కేంద్రీకరించి ఆ కార్యక్రమాన్ని పూర్తి చేయటమే ప్రధాన కారణం అని నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ అన్న విషయం గుర్తుంచుకుంటే, మన దేశంలో వ్యవసాయం ప్రస్తుత దుస్థితిలో ఎందుకున్నదో విదితమవుతుంది. తద్దినం పెట్టినట్లు భూసంస్కరణలను అమలుజరపటం తప్ప, గ్రామీణ జీవితంలో సంస్థాగత మార్పును తీసుకుని రాలేకపోయింది. ఆ మార్పు రాకపోగా, సస్యవిప్లవం పుణ్యమా అంటూ భూకామందులు మరింత ధనవంతులవ్వటం, చిన్న సన్నకారు రైతులకు భూకామందులకు మధ్య అంతరం పెరగటం, పేదరికం పెరగటం జరిగింది. 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత ప్రభుత్వం వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టడాన్ని తగ్గించుకుంది. ఆర్థిక శాస్త్రవేత్తలు ఇది మంచిపని కాదని హెచ్చరిస్తూ వచ్చినా, పెట్టుబడులు తగ్గించటం వల్ల వ్యవసాయం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, ప్రభుత్వం ఎందుకు పునరాలోచించటం లేదు? ఈ ప్రశ్నకు జవాబు వచ్చే సంచికలో చూడవచ్చు. ○

ఆహారం, ఉద్యోగం, వైద్యం, విద్య: లక్ష్యాలకు బహుదూరం

విజన్ 2020 పత్రం ఈ కింది లక్ష్యాలను నిర్దేశించింది:

స్థూల జాతీయ ఉత్పత్తిలో 9% పెరుగుదల; అందరికీ ఆహారం; అందరికీ ఆరోగ్యం; అందరికీ ఉద్యోగాలు

స్థూల జాతీయ ఉత్పత్తికి సంబంధించిన గణాంకాలను ఒక ప్రత్యేక సంవత్సరంలో సాధించిన దాన్నిబట్టి పరిగణనలోనికి తీసుకోలేము. గత సంవత్సరంలో అభివృద్ధి రేటు తక్కువగా ఉంటే, ప్రస్తుత సంవత్సర రేటు అంతకంటే ఎక్కువ ఉన్నట్టే కనిపిస్తుంది. ఈ దృష్టితో చూస్తే, భారత ఆర్థికరంగంలో పెరుగుదల రేట్లకు సంబంధించిన గణాంకాలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. ఒక స్థిరమైన ధోరణి కనిపించడంలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలోని గత నాల్గవ భాగంలో అభివృద్ధి రేటు చాలా ఎక్కువగా, అంటే 8.40 శాతం నమోదయ్యింది. వ్యవసాయరంగం, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలతో కూడిన ఉత్పాదక రంగాల పనితీరును కూడా పరిగణనలోనికి తీసుకుంటే తప్ప, ఈ అభివృద్ధి రేటును హర్షించలేము. ఎందుకంటే అవి చాలా కాలంగా అంతర్జాతీయ మార్కెట్ల నుంచి కనుమరుగయ్యాయి. సేవారంగం పనితీరు చాలా వరకూ అంతర్జాతీయ పరిణామాల స్పందన మాత్రమే.

అందరికీ ఆహారం

1960నాటి తీవ్ర ఆహార ధాన్యాల కొరతను అధిగమిస్తూ భారత్ స్వయంసమృద్ధిని సాధించింది. 1970ల మధ్య కాలానికి మిగులు ధాన్యాల నిల్వలు పెరిగాయి. ఆ పెరుగుదల నిరవధికంగా కొనసాగుతోంది. కాని సరైన ప్రశ్న ఏమంటే– ఈ ఆహారధాన్యాల నిల్వలు పెరగటం వల్ల పేదలకు ఎంతమాత్రం ఆహార భద్రత కలుగుతోంది? తక్షణం కాకపోవచ్చు, కాని, రానున్న కొద్ది సంవత్సరాలలోనైనా అలాంటి అవకాశం ఉందా? ఇందువల్ల ధరల స్థిరీకరణ జరగవచ్చు, కాని అంతమాత్రాన అదే 'ఆహార భద్రత' అని చెప్పగలమా? మరోవైపు, నూనెగింజలు, పప్పుధాన్యాల ఉత్పత్తి సంతృప్తికరంగా లేదు. స్వదేశీ మార్కెట్‌లో ధరలను స్థిరీకరించేందుకు మనం ఇప్పటికీ భాద్య తైలాలను దిగుమతి చేసుకుంటున్నాము. 2005 నుండి అమలులోకి రానున్న ప్రపంచ వాణిజ్య సంస్థ శాసనాలు మన నూనెధాన్యాల ఉత్పత్తిని ఇంకా అస్థిరపరచనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌కు మన ఆర్థిక వ్యవస్థను బార్లా తెరచినపుడు మనం ఇతర దేశాలతో పోటీపడాల్సి ఉంటుంది. లేకపోతే, వ్యవసాయం కూడా లాభదాయకం కాకుండాపోతుంది. కొన్ని పంటల దిగుబడులను పోల్చిచూస్తే, అంతర్జాతీయంగా మనం చాలా నష్టపోతున్న విషయం స్పష్టంగా బోధపడుతోంది. భారత్‌లో 1 హెక్టారుకు ధాన్యం దిగుబడి 2.89 మెట్రిక్ టన్నులు. కాని ప్రపంచంలో అత్యధిక దిగుబడి 8.52 మెట్రిక్ టన్నులున్నది. భారత్‌లో మొక్కజొన్న, వేరుశనగ, సన్‌ఫ్లవర్ హెక్టారుకు 1.61, 1.03, 0.58 మెట్రిక్ టన్నుల దిగుబడి లభిస్తోంది. కాని ప్రపంచంలో ఇవే పంటలకు లభించే అత్యధిక దిగుబడి 9.32, 2.99, 2.89 మెట్రిక్ టన్నులు! భారతదేశంలో వివిధ పంటలకు లభించవలసిన ఫలసాయానికి, లభిస్తున్న ఉత్పత్తికి చాలా తారతమ్యాలున్నాయి. ఈ తేడాలు 50 నుండి 125 శాతం దాకా ఉంటున్నాయి. ఆ విధంగా భారత వ్యవసాయాన్ని మరింత ఆచరణ సాధ్యంగా, పోటీపడే విధంగా చేసేందుకు ఆధునీకరణ, వ్యాపారీకరణ సాధించడం అవసరం. ఆధునీకరణకు సంబంధించి వ్యవసాయంలో 1960ల మధ్యలో హరిత విప్లవం అనంతరం ఎలాంటి నూతన సాంకేతిక పద్ధతులూ ప్రవేశపెట్టలేదు. అందుకు కారణం వ్యవసాయరంగ పరిశోధన అభివృద్ధికి బడ్జెట్‌లలో అతితక్కువ కేటాయింపులే!

అవసరమైన స్థాయికి వ్యవసాయాన్ని అభివృద్ధిపరచాలంటే మన విధానాలలో సమూల మార్పులు రావాలి. కనీస అవసరాలైన నీటిపారుదల సౌకర్యాలు, విద్యుత్, అభివృద్ధి–పరిశోధన ప్రయత్నాలు అత్యధిక స్థాయిలో చేపట్టాలి.

ఉపాధి:

భారత్‌లో మొత్తం నిరుద్యోగుల సంఖ్యను 2002లో 35 మిలియన్లుగా అంచనావేశారు. (నేటికి ఇది 40 మిలియన్లకు చేరింది) 2020 నాటికి భారత శ్రామిక శక్తి 160–170 మిలియన్లకు పెరగవచ్చు. అందువల్ల రానున్న 20 ఏళ్లలో 200 మిలియన్ల మందికి అదనపు ఉపాధి అవకాశాలు సమకూర్చాల్సిన అవసరం ఉంది. విజన్ 2020 పత్రం అందరికీ లాభదాయకమైన ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఉండాలని చెప్పింది. ఉపాధి హక్కు అనేది కేవలం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతాంశం మాత్రమే కాదు, నిరంతరం ప్రభుత్వం హామీ కల్పించవలసిన ప్రాథమిక హక్కు కూడా. ప్రస్తుత ప్రభుత్వ సంఘటితరంగం 5.5 శాతం అవకాశాలనే సమకూరుస్తోంది. ప్రైవేటు సంఘటితరంగం 2.5 శాతం, గుర్తింపులేని రంగం మొత్తం 92 శాతం ఉద్యోగాలు సమకూరుస్తోంది. ప్రభుత్వరంగం ఉద్యోగాలను సమకూర్చడాన్ని కొనసాగించాలి. అలాగే ప్రైవేటు సంఘటితరంగం

సంవత్సరానికి 30 శాతం దాకా పెరిగినప్పటికీ కూడా, ఐదేళ్ళకి కేవలం 1 శాతం కంటే తక్కువ శ్రామికశక్తికి మాత్రమే అవకాశం కల్పించగలుగుతుంది. అంతర్జాతీయంగా పోల్చి చూసినా కూడా- చిన్న మధ్యతరగతి పరిశ్రమలే అత్యధిక ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి. అమెరికాలో సగం ప్రైవేటు శ్రామికశక్తి చిన్నసంస్థల్లో పనిచేస్తోంది. వాటిలో ఐదింటికి మూడు సంస్థల్లో 5గురికంటే తక్కువ ఉద్యోగులు పనిచేస్తున్నారు. జపాన్‌లో చిన్న, మధ్య తరగతి సంస్థల్లో 78 శాతం ఉద్యోగాలు లభిస్తున్నాయి. కొరియాలోని మొత్తం ఉత్పత్తి సంస్థల్లో చిన్న, మధ్య తరగతి సంస్థలు 99 శాతం కాగా, అవి 69 శాతం ఉపాధిని ఆ రంగంలో సమకూరుస్తున్నాయి. అందువల్ల భారత్‌తో సహా ప్రపంచ వాణిజ్యం, పెట్టుబడి మార్కెట్‌లలో మంచిస్థానం పొందిన గుర్తింపులేని రంగం ఆదేశ ఉపాధి వ్యూహంలో కీలకస్థానం వహించాలి. అందుకు విధానాలలో మార్పు, రుణ సదుపాయాలను పెంచే కార్యక్రమాలు, ఉత్పాదకత పెంపు, నాణ్యతా దృక్పథం, పోటీతత్వం మొదలైనవన్నీ ఉద్యోగాల నాణ్యతను పెంపొందింప చేస్తాయి. ఈ నివేదిక ఉపాధి అవకాశాలను పెంపొందించే అత్యంత సామర్థ్యంగల కొన్ని రంగాలను గుర్తించింది. అవి: చిన్నతరహా పరిశ్రమలు (36 మిలియన్లు), అటవీ అభివృద్ధి (10 నుండి 15 మిలియన్ల దాకా), సేవారంగం (120 మిలియన్లు), పర్యాటక రంగం (20 మిలియన్లు), విద్యారంగం (4 మిలియన్లు) మొదలైనవి. ఐటి సంబంధిత సేవలు మరో ప్రాధాన్యతల రంగం. నాసికా మెకెన్సీ (1999) అధ్యయనం ప్రకారం ఈ రంగం 2 మిలియన్ల ఉద్యోగాలను 10 ఏళ్లలో సృష్టించగలుగుతుంది.

మానవుడి సగటు ఆయుర్దాయం 33 సంవత్సరాల నుండి 64 ఏళ్ళకు పెరిగింది. శిశుమరణాల రేటు వెయ్యి మందికి 148 నుండి 71కి తగ్గింది. జననాల రేటు 41 నుండి 25కి తగ్గగా, మరణాల రేటు 25 నుండి 9 కంటే తక్కువకు పడిపోయింది. అయితే అభివృద్ధితోబాటు, వివిధ ఆదాయవర్గాల మధ్య వివక్షతలు విస్తృతంగా నెలకొన్నాయి. పట్టణ- గ్రామీణ ప్రాంతాల మధ్య, వివిధ రాష్ట్రాల మధ్య, ఒకే రాష్ట్రంలోని వివిధ జిల్లాల మధ్య కూడా భారీ వివక్షతలు చోటుచేసుకున్నాయి.

విద్య:

విజయవంతమైన విద్యావిధానం మానవాభివృద్ధికి అవసరమైన రాజకీయ, ఆర్థిక, సాంకేతిక, శాస్త్ర, సామాజిక, పర్యావరణ రంగాలన్నింటికీ ఒక దృఢమైన పునాదిని నిర్మిస్తుంది. ప్రతిస్పందించే ప్రజాస్వామ్యానికి విద్య పునాది. విద్యవల్లే పౌరులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, జాతి అంతర్గత అభివృద్ధిని బలోపేతం చేయగలుగుతారు. ప్రపంచ సమాజంలో తమ జాతి నిర్మాణాత్మక పాత్రను పెంపొందించుకోగలుగుతారు. విద్య ఉపాధిని సమకూరుస్తుంది.

గత ఐదు దశాబ్దాలుగా భారత విద్యావిధానం బాగా విస్తరించింది. కాని దాని ప్రస్తుత విజయాలు, దేశ అవసరాలకు చాలినంతగా, జాతి తన ఉత్పాదక సామర్థ్యాన్ని గుర్తింపచేసేలా లేవు. ప్రస్తుతం ప్రాథమిక, సెకండరీ స్థాయిల్లో నమోదు రేటు చాలా తక్కువగా ఉంది. చదువు మానేసేవారి సంఖ్య చాలా అధికంగా ఉంటుంది. స్త్రీ పురుషుల మధ్య, ప్రాంతాల మధ్య, వివిధ వయసుల వారి మధ్య అత్యధిక విద్యా తారతమ్యాల వల్ల దేశంలో 30 మిలియన్ల వయోజనులు నిరక్షరాస్యులుగా ఉన్నారు. ఈ సంఖ్య ప్రపంచంలోనే అత్యధిక నిరక్షరాస్యతని సూచిస్తోంది. ప్రస్తుత నమోదు రేటు అత్యధిక స్థాయికి పెరగాలి. అలాగే బడిమానేసే వారి సంఖ్య కనీస స్థాయికి తగ్గాలి. స్త్రీ, పురుష వివక్ష రూపుమాపాలి. మరిన్ని తరగతి గదులు, ఉత్తమ బోధనా పరికరాలు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకం ద్వారా చదువుల నాణ్యతను పెంచాలి. విద్యారంగంలో నాణ్యత గల పద్ధతులను ప్రవేశపెట్టాలి. నిష్క్రియాపరమైన అధ్యయనం నుండి పిల్లలు తమంతట తాము నేర్చుకోగలిగే సామర్థ్యాన్ని కల్పించాలి. అదేపనిగా చదవడం నుండి విమర్శనాత్మక విశ్లేషణకు, సాంప్రదాయ పాఠ్యాంశాల నుండి సందర్భోచిత పాఠ్య ప్రణాళికలకు, సమాచారాన్నించి జీవన విలువల బోధనకు, స్వతంత్రంగా ఆలోచన, స్వావలంబన, వ్యక్తిగత చొరవ పెంపొందించేందుకు చదువు తోడ్పడాలి. ఇదంతా జరగాలంటే విద్యపై పెట్టే పెట్టుబడులు రెట్టింపు అవ్వడం అవసరం. స్థూల జాతీయోత్పత్తిలో విద్యకోసం ప్రస్తుతం స్థిరపడిన కేటాయింపు 3.2 - 4.4% నుండి 7.9 శాతానికి పెంచాలి.

పరిశోధన-అభివృద్ధి రంగంలో గొప్ప కృషి జరగడం అవసరం. ఈ రంగానికి కేటాయిస్తున్న మొత్తం అంతాచూస్తే అది కొరియా వెచ్చిస్తున్న దానిలో 1/60వ వంతు, అమెరికా వెచ్చిస్తున్న దానిలో 1/230వ వంతు, జపాన్ వెచ్చిస్తున్న దానిలో 1/340వ వంతు ఉంటుంది. మన శ్రామికశక్తి జ్ఞానం నైపుణ్యం - మనం సృష్టిస్తున్న ఉద్యోగాల సంఖ్య, రీతి, భారత భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి ప్రధాన అవరోధంగా ఉన్నాయి. చైనా మానవశక్తికి ఆధారం శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు వారి జనాభా- మన జనాభా కంటే 3 రెట్లు అధికం.

అందరికీ ఆరోగ్యం

గత 50 ఏళ్ళుగా భారత జనాభా ఆరోగ్యం చాలా అకస్మాత్తుగా మెరుగుపడింది. మనం ఒక దేశ ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి కొన్ని సూచికలను పరిగణనలోకి తీసుకోవాలి. మానవుడి సగటు ఆయుర్దాయం 33 సంవత్సరాల నుండి 64 ఏళ్ళకు పెరిగింది. శిశుమరణాల రేటు వెయ్యి మందికి 148 నుండి 71కి తగ్గింది. జననాల రేటు 41 నుండి 25కి తగ్గగా, మరణాల రేటు 25 నుండి 9 కంటే తక్కువకు పడిపోయింది. అయితే అభివృద్ధితోబాటు, వివిధ ఆదాయవర్గాల మధ్య వివక్షతలు విస్తృతంగా నెలకొన్నాయి. పట్టణ-గ్రామీణ ప్రాంతాల మధ్య, వివిధ రాష్ట్రాల మధ్య, ఒకే రాష్ట్రంలోని వివిధ జిల్లాల మధ్య కూడా భారీ వివక్షతలు చోటుచేసుకున్నాయి. ఆర్థికాభివృద్ధి కంటే అదనంగా తలసరి ఆదాయం, ఉపాధి, అక్షరాస్యతా స్థాయి, విద్య, మంచినీటి సదుపాయం, ప్రభుత్వ- ప్రైవేటు వైద్య సదుపాయాలు, ప్రైవేటు ఆరోగ్య వైద్య సంరక్షణ అందుబాటు, ఆరోగ్య బీమా, ప్రజా పారిశుధ్యం, రోడ్ల భద్రత, వాతావరణ కాలుష్యం మొదలైనవన్నీ ఒక దేశ ఆరోగ్యాన్ని నేరుగా ప్రభావితం చేస్తాయి. ఇవి బలహీనవర్గాలైన మహిళల మీద, పిల్లల మీదా మరింత ప్రభావం చూపుతాయి. విజన్ 2020 ప్రధాన కేంద్రీకరణ వృద్ధ మహిళలు, బాలల ఆరోగ్య సంరక్షణ అవసరాలు తీర్చడంపై ఉండాలి.

భారత్‌పై ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రభావాన్ని వెల్లడించడంపై ఈ నివేదిక దృష్టి కేంద్రీకరిస్తోంది. అది మంచి అవకాశాలనే కాదు తీవ్ర సమస్యల్ని కూడా కల్పిస్తోంది. దాని ఆకస్మిక ప్రభావం వల్ల-ప్రజలు, సేవలు, సరుకులు అన్ని దేశాల జాతీయ సరిహద్దునూ స్వేచ్ఛగా దాటగలుగుతున్నాయి. ప్రపంచంలో భారత్ అత్యధిక జనాభా గల రెండవ దేశం. అది ఒక ప్రతికూలాంశమే అయినా అది ఒక వరం కూడా. ప్రపంచంలోని వివిధ దేశాల జనాభా స్థితిగతులను 15 ఏళ్ళపాటు విశ్లేషిస్తే, భారత్ తన జనాభాలో 65శాతం పనిచేసే వయసుగల శ్రామికశక్తితో ఉన్నది. కాగా అనేక అభివృద్ధి చెందిన దేశాలలో 65 శాతం శ్రామిక శక్తి 65 ఏళ్ళకు పైబడిన వారే! మనం ముందుచూపుతో, స్థిర సంకల్పంతో మన శ్రామికశక్తి విద్యని, ఉత్పత్తి నైపుణ్యాలను అభివృద్ధి పరచగలిగితే ఆయా దేశాలకు శ్రామిక శక్తిని సరఫరా చేసే అతిపెద్ద ఎగుమతిదారులమవుతాము.

చిన్న, మధ్య తరగతి పరిశ్రమల్లో ఉద్యోగాలు చేస్తున్న శ్రామికుల ఉత్పాదకత, నైపుణ్యాలు అభివృద్ధి చెందడం వల్ల ఇతర దేశాలతో మన దేశం పోటీ పడగలుగుతుంది. విదేశీ వస్తువులతో దేశం మునిగిపోకుండా ఆపుతుంది. అదేవిధంగా భిన్నత్వం, వ్యాపారీకరణ, వ్యవసాయరంగంలో అత్యధిక ఉత్పాదకత - ప్రపంచ వాణిజ్య సంస్థ హయాంలో తప్పనిసరి. ఈ అవకాశాన్ని చేజిక్కించుకోవడంలో మనం విఫలమైతే, తెలివితో, దృఢసంకల్పంతో వ్యవహరించకపోతే, ఈ నిరక్షరాస్య ప్రజాసమూహాలు, నిరుపేద జనాభా భవిష్యత్తు మరింత దుర్భరమవుతుంది. ఫలితంగా అంతర్గత శాంతిభద్రతలు క్షీణించి విప్లవానికి దారితీస్తాయి. ○

(ఫిబ్రవరి 14, 15 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ అసోసియేషన్ 22వ వార్షిక మహాసభలో చేసిన అధ్యక్షోపన్యాసం నుండి - సం.)

వీక్షణం పాఠకులకు, చందాదారులకు విజ్ఞప్తి

'వీక్షణం' పాత చందాదారులు తమ చందాను పునరుద్ధరించదలుచుకున్నట్లయితే 140 రూపాయలను మనియార్డరు ద్వారా గాని లేదా 'సమతా పబ్లికేషన్స్' పేర డి.డి. తీసిగాని పంపాలి. తమ అడ్రస్సు పక్కన గల నెంబరును తప్పకుండా తెలియచేయవలసి ఉంటుంది.

కొందరు కొత్తగా చేరుతున్న చందాదారులు మనియార్డరు వెనుక భాగంలో గల అడ్రస్సు కాలంలో అడ్రస్సు రాయడం మరచిపోతున్నారు. వారి డబ్బు అందినప్పటికి అడ్రస్సు లేని కారణంగా పత్రిక పంపించడం సాధ్యం కాదు కాబట్టి ఆ విధంగా చందాకట్టి పత్రిక రానట్లయితే అడ్రస్సును స్పష్టంగా పోస్టుకార్డుపై రాసి తెలియపరచగలరు.

గత సంవత్సరం చందాదారులు కొందరు తమ చందాలను పునరుద్ధరించుకోనప్పటికి వీక్షణం అభిమానులుగా ఎంచి వారికి పత్రికను పంపించడం జరుగుతుంది. అలాంటి వారు తమ చందాను వీలైనంత తొందరగా అందచేస్తారని ఆశిస్తున్నాం.

- సం

గోదావరి ఎత్తిపోతలు - పంపుసెట్లు - విద్యుత్ వినియోగం

(గత సంచిక తరువాయి)

- ఎమ్. తిమ్మారెడ్డి

వ్యవసాయరంగంలో విద్యుత్ వినిమయం:

అసలు వ్యవసాయరంగంలో విద్యుత్ వినిమయ విషయం నేటికీ వివాదాస్పదమే. మీటర్లు లేనందున వ్యవసాయంలో విద్యుత్ వినిమయానికి స్పష్టమైన అంచనాలు లేవు. ఈ కారణంగానే ప్రస్తుతం పాలనా యంత్రాంగపు అంచనాలు ఈ విధంగా వుంటున్నాయి. గృహవినియోగదార్ల వినియోగం, వాణిజ్య పారిశ్రామిక రంగాల వినియోగంలో పంపిణీ. సరఫరా నష్టాలను కలిపేసుకుని, మొత్తం విద్యుత్ వినిమయంలో నుంచి మినహాయించి, యిదిగో యిదీ "వ్యవసాయరంగ" విద్యుత్ వినిమయం అని చూపుతున్నారు. అయితే, నిర్వహణా సామర్థ్యానికి గీటురాయిగా నిలిచే పంపిణీ, సరఫరా నష్టాలను, వాస్తవ గణాంకాలకంటే అతి తక్కువగా చూపి, వ్యవసాయరంగ వినిమయాన్ని అధికం చేసి చూపుతున్నారు.

విద్యుత్ వినిమయాన్ని పెంచి చెప్పుకొస్తున్నారనేందుకు మరో కారణం రికార్డుల్లో పెంచి చూపిస్తున్న వ్యవసాయ విద్యుత్ మోటార్ల సంఖ్యలో చాలామటుకు వినియోగంలో లేకున్నా రికార్డుల్లో అవి పనిచేస్తూనే ఉన్నాయి. గణాంకాల సేకరణలో భాగంగా రాష్ట్రంలో వినియోగంలో ఉన్న విద్యుత్, డీజిల్ మోటార్ల గణాంకాలనూ సేకరించడం జరిగింది. ఈ సర్వే ప్రకారం వరంగల్ జిల్లాలో 1,30,750 పంపుసెట్లు వుండగా, ట్రాన్స్‌కో వారి రికార్డుల్లో మాత్రం 2,02,499 విద్యుత్ మోటార్లను చూపడం జరుగుతోంది. అయితే యిదో ఉదాహరణ మాత్రమే. రాష్ట్రవ్యాప్తంగా యితర జిల్లాల్లోనూ యిదే తంతు.

వ్యవసాయరంగంలో విద్యుత్ వినిమయ అంచనాలు ఎలా పెడతోవన పడుతున్నాయో... పై పట్టిక తెలియజేస్తుంది. 1980 తదనంతరం ప్రభుత్వ విధానాలకనుగుణంగా వ్యవసాయ రంగంలో బావుల కింద సేద్యం గణనీయంగా పెరిగింది. యిందుకు ప్రధానంగా రెండు కారణాలు. ఒకటి- నాటి ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్‌కు రాయితీలనివ్వడటం, రెండు- చెరువుల క్రింద సేద్యం కలిసిరాకపోవడం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా బావుల క్రింద ఉన్న సేద్యపు శాతం, మొత్తం సేద్యపు విస్తీర్ణంలో 42%.

2001-02 నాటి గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 55.6 లక్షల ఎకరాలకు నీటివసతి, పెరిగిన పంపుసెట్ల ద్వారా లభ్యమౌతుంది. యిక జిల్లాల విషయానికొస్తే, నల్గొండ జిల్లాలో 3.62 లక్షల ఎకరాలు, వరంగల్ జిల్లాలో 6.4 లక్షల ఎకరాలకు నీటివసతి అదనంగా లభ్యమైంది. విద్యుత్ వినిమయంలో నల్గొండ 1,182.47 మిలియన్ యూనిట్లు, వరంగల్ జిల్లా 1238.4 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను బావుల క్రింది సేద్యానికి వినియోగించుకుంటున్నాయి. ఒక మిలియన్ యూనిట్ వినిమయం ఎన్ని ఎకరాలకు సేద్యానికి దోహదపడుతుందన్న విషయానికొస్తే, నల్గొండ జిల్లాలో 307 ఎకరాలు, మెదక్ జిల్లాలో 628 ఎకరాలకని తేలింది. రాష్ట్రవ్యాప్త సరాసరి లెక్కలు తీసుకుంటే ఒక మిలియన్ యూనిట్‌కు 554 ఎకరాలని తేల్తుంది. ఈ సరాసరి గణాంకాలు, గోదావరి ఎత్తిపోతల పథకం ద్వారా, ఒక మిలియన్ యూనిట్ వినిమయానికి కనీసం 500 ఎకరాలు సాగునీటి వసతిని పొందగలవని రూఢి అవుతుంది. ఈ రెండు అంశాలను విచక్షణతో సవరించి పరిగణనలోనికి తీసుకున్నట్లయితే, బావుల క్రింది సేద్యమే, గోదావరి ఎత్తిపోతల పథకం కన్నా బహుమెరుగైందని స్పష్టం అవుతుంది. ఎందుకంటే, ఒక మిలియన్ యూనిట్ వినిమయం ద్వారా నీటివసతి లభ్యత బావుల క్రింది సేద్యంలో పెరగ్గా, గోదావరి

విస్తీర్ణం ఎకరాల్లో

	వరంగల్	కరీంనగర్	మెదక్	నల్గొండ	రాష్ట్రవ్యాప్తంగా
బావులకింద సేద్యం	6,92,523	6,08,746	4,22,041	3,67,400	62,58,034
విద్యుత్ పంపుసెట్ల ద్వారా సేద్యపు విస్తీర్ణం	6,47,509	5,72,221	4,16,132	3,62,991	55,63,392
విద్యుత్ పంపుసెట్ల సంఖ్య	1,30,750	1,45,954	79,477	96,293	11,15,452
	(93.5%)	(54%)	(98.6%)	(98.8%)	(88.9%)
డీజిల్ పంపుసెట్ల సంఖ్య	9,089	9,381	1,105	1,200	1,38,824
	(6.5%)	(6%)	(1.4%)	(1.2%)	(11%)
మొత్తం పంపుసెట్ల సంఖ్య	1,39,839	1,55,335	80,582	97,493	12,54,276
పంపుసెట్ల కనెక్షన్ల సంఖ్య (ట్రాన్స్‌కోవారి రికార్డుల ప్రకారం)	2,02,499	1,69,485	1,27,662	1,71,737	19,39,573
విద్యుత్ వినిమయం వ్యవసాయంరంగంలో (ఎమ్.యు)	1,238.40	1,170.10	663.06	1,182.47	10,222.13

ఎత్తిపోతల పథకం విషయంలో తగ్గిపోతుంది కనుక.

ముగింపు:

250 మీటర్ల ఎత్తులో ఉన్న ధర్మసాగరం చెరువుకు 50 టిఎంసిల జలాన్ని పంపేందుకై 1000 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ని వినియోగించగా, ఐదు లక్షల ఎకరాలకు నీటివసతి లభ్యం కాగలదని అంచనా. యిదే స్థాయి విద్యుత్ వినిమయం ద్వారా 1,35,400ల మోటార్ పంపుసెట్లను (5 హెచ్.పి.) వినియోగించడం ద్వారా 6,77,000 ఎకరాలకు నీటివసతిని చేకూర్చవచ్చు. ఇదే పరిమాణం జలాన్ని 427 మీటర్ల ఎత్తున ఉన్న హస్నాపల్లికి పంపించేందుకు 1650 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినిమయమౌతుంది. యిదే స్థాయి విద్యుత్ వినిమయంతో 2,23,425 (5 హెచ్‌పి స్థాయి) మోటార్లను వినియోగించుకోగలగడం ద్వారా 11,17,125 ఎకరాలకు నీటివసతిని కల్పించుకోగలుగుతాము. ఈ అంతరం సద్వినియోగ ప్రత్యామ్నాయ విధానాలను మనముందు ఉంచుతుంది. అదే స్థాయి విద్యుత్ వినియోగం అదే పరీవాహక ప్రాంతంలో ఎక్కువ విస్తీర్ణానికి దోహదపడుతుంది. ఈ అంశం గోదావరి ఎత్తిపోతల పథక పునః పరిశీలనకై ఒత్తిడి చేస్తుంది. సాగువసతి విస్తీర్ణంలో రాజీపడకుండానే విద్యుత్ వినిమయాన్ని కుదించగల ప్రత్యామ్నాయాన్నీ సూచిస్తుంది. ఎంత ఎత్తుకు నీటిని పంపించాలి అన్న అంశం కూడా యిందులో అంతర్లీనంగా ఉంది.

పైగా గోదావరి జలాల ఎత్తిపోతల పథక నిర్వహణకై సింగారెడ్డి పల్లె, దుమ్ముగూడెంల వద్ద జలవిద్యుత్ ఉత్పాదనా కేంద్రాలను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తుంది. అప్పుడు విద్యుత్ ఉత్పాదనా కేంద్రాల ఉత్పాదనా సామర్థ్యం ఒకవేళ విఫలమైతే, ఎత్తిపోతల పథకం భవిష్యత్ అగమ్యగోచరమే కదా!

విద్యుత్‌రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, ఎత్తిపోతల పథక భవిష్యత్‌లో పలు ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి; రాయితీల నుండి ప్రభుత్వం వైదొలగో పక్షంలో, ఈ అదనపు చెల్లింపుల భారాన్ని భరించగలిగే స్థాయిలో మన రైతాంగం ఉందా? ప్రతిపాదిత ఎత్తిపోతల పథకంలో విద్యుత్ వినిమయం అధికం కదా! మనం ఓసారి అంచనాలను వేయగలిగితే, ప్రస్తుతం బావుల క్రింది సేద్యం చేస్తున్న రైతాంగం చెల్లిస్తున్న దానికి పదిరెట్లు అదనంగా ఈ ఎత్తిపోతల పథకంలో రైతు చెల్లించాల్సి వస్తుంది. ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం నిర్వహించకుండా... ఆ నిర్వహణా వ్యయాన్నీ రైతుల నెత్తిమీదే వేస్తే ఆ భారం మరింత పెరుగుతుంది. ప్రధాన వ్యయాలను ప్రభుత్వం భరించకుంటే అసలు ఈ ఎత్తిపోతల పథకమే ఓ 'మిథ్య' అయికూచుంటుంది. ○

(స్వేచ్ఛానువాదం : విద్యాభూషణ్)

ఎన్‌కౌంటర్

"గెలిస్తే రాష్ట్రాన్నే అమ్మేస్తారు." చంద్రబాబు
- ఇంకేం మిగిలింది గనక అమ్మడానికి

"మన దగ్గర భూమి వుంది, అడవులున్నాయి, నీరుంది, డబ్బుంది, మానవ సంపద ఉంది" వాజ్‌పేయి

- ఏం లాభం? భూమి వుందిగాని దున్నేవాడి చేతిలో లేదు. అడవులు స్మగ్లర్లకు బలి అవుతున్నాయి. నీరుంది కాని సముద్రంలోకి పోతుంది. డబ్బుంది కాని ఎవరి దగ్గర? మానవ సంపద వుంది కాని నిరుద్యోగంలో ఉంది. ఫ్...

"మాది లాభాల్లో ఉన్న పార్టీ" చంద్రబాబు

- అవునవును. మరో అయిదు సంవత్సరాల రాజకీయ వ్యాపారానికిగాను ఈ ఎన్నికల్లో పెట్టుబడులను విపరీతంగా పెంచేశారుగా!

"మా పని మాకు తెలుసు" అమెరికాపై పాక్‌మంత్రి కోపం

- మీ పని అమెరికా చేతుల్లో పెట్టి, ఇపుడలా అనుకుంటే ఏం లాభం?

"మాటకు కట్టుబడతాం" అమెరికా అధ్యక్షుడు బుష్

- అవునవును. ఇరాక్‌లో రసాయనికాయుధాలు ఉన్నాయని చెప్పి, ఆ తర్వాత లేదని చెప్పినపుడే తెలిసింది.

"రు.15364 కోట్లతో రాష్ట్రాభివృద్ధి" రాష్ట్ర సమాచార మంత్రి

- **రు. 15364** కోట్లు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు చేస్తానని, రెండు సంవత్సరాల క్రితం చెప్పిన ముఖ్యమంత్రి ఎంత అభివృద్ధి చేశారో తెలుస్తూనే ఉంది.

"పొలం కాపలాకు పోయినోడిని కాల్చి చంపారు" తల్లిదండ్రులు

- అది కొత్త విషయమా ఏమిటి? ఇంట్లో పడుకున్న వాళ్ళనే లేపి తీసుకొని వెళ్లి చంపేయటం పోలీసులకు అలవాటే.

"వాజ్‌పేయి నోట విదేశీపుటిన మాట" వార్త

- ఎన్నికల్లో గెలుపు మీద అంతగా ఆశపోయిందా? ఇలాంటి చిన్న విషయం పట్టుకుని వెళ్లాడుతున్నారు?

"ప్రజాసంక్షేమాన్ని కోరి ఎన్టీఆర్ రద్దు చేసిన శాసన మండలిని పునరుద్ధరిస్తామనడం కాంగ్రెస్ అనైతికతను తెలియజేస్తుంది" - సోమిరెడ్డి

ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్టీఆర్ రద్దుచేసిన మద్యపానాన్ని తిరిగి అంగరంగ వైభవంగా పునరుద్ధరించిన పెద్దమనుషులేనా ఈ మాట మాట్లాడేది! ○

పర్యావరణం - 6

రొయ్యల చెరువుల 'అభివృద్ధి'.. వరమా, శాపమా?

ఇంత కాలానికి రాష్ట్రప్రభుత్వం 'నీరు-మీరు' కార్యక్రమం ద్వారా జలవనరుల సంరక్షణపై దృష్టిసారించడం అభినందనీయం. అయితే నీటి వనరుల అభివృద్ధిపై మాత్రమే కాకుండా నీటివృధాను అరికట్టడంలోనూ, జలకాలుష్యాన్ని నివారించడంలో కూడా శ్రద్ధ చూపించవలసి ఉంది.

యునిసెఫ్, వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ వారి నివేదికలు ముందు ముందు రాబోయే తరాలు తీవ్రమైన మంచినీటి సంక్షోభాన్ని ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించాయి. రోజురోజుకీ పెరిగిపోతున్న జలకాలుష్యం, వృధా చేయబడుతున్న నీరు, జల వినియోగానికి సంబంధించిన విధాన నిర్ణయాలు తీసుకోవడంలో చూపించబడుతున్న నిర్లక్ష్యం, ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయని ఆ నివేదికలు వెల్లడించాయి.

మనదేశంలో దాదాపు లక్షకుపైగా నివాస ప్రాంతాల్లో 440 లక్షల మంది ప్రజలు- పారిశ్రామిక వ్యర్థాల కారణంగానో లేదా ఫ్లోరైడ్, ఆర్సెనిక్‌లాంటి ప్రాణాంతకమైన విషపూరిత వ్యర్థాల కారణంగానో కలుషితం కాబడిన నీటివల్ల అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. వీటికితోడు ఉప్పునీరు, ఆర్సెనిక్‌లాంటి రసాయనాల వల్ల కూడా త్రాగునీటి సమస్య అధికమవుతోంది.

ఇటువంటి పరిస్థితుల్లో సహజనీటి వనరుల్లో 70% పైగా వినియోగించుకొంటున్న వ్యవసాయ రంగానికి సంబంధించి కొన్ని నియమ నిబంధనలను నిర్దేశించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. కానీ ఈ మధ్యకాలంలో కృష్ణా, గోదావరి, నెల్లూరు, కోస్తాజిల్లాల్లో వ్యవసాయ భూములు త్వరత్వరగా రొయ్యల చెరువులుగా, చేపల చెరువులుగా మారిపోతుండటం మనం చూస్తూనే ఉన్నాం. అయితే రొయ్యల చెరువుల ద్వారా వచ్చే లాభాల సంగతి మనకు తెలుసుకానీ, ఇందులో మంచినీటిని వినియోగించటం, వృధాచేయటంలాంటి నష్టాలు కూడా ఉన్నాయి. అంతేగాక అవసరాన్ని మించిన నీటి వినియోగం, నీటివృధా లాంటి నష్టాలూ, ఉపరితల - భూగర్భ జలాల కాలుష్యం, భూమి వట్టిపోవడం లాంటి పర్యావరణానికి హానికరమైన తీవ్రమైన నష్టాలు కూడా కలుగుతున్నాయి.

ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఒక ఎకరం వరి పొలానికి అవసరమైన నీటికంటే, అదే ఎకరం రొయ్యల చెరువుకోసం అవసరం అయ్యే నీరు ఐదురెట్లు ఎక్కువ! అయితే చాలా సందర్భాల్లో ఈ రొయ్యల చెరువులో వినియోగించుకున్న నీటిని మంచినీరుగా ఉపయోగపడుతున్న జలాల్లో కలిపేయడం సాధారణంగా జరిగిపోతూంది. దీనివల్ల రాబోయే సంవత్సరాల్లో ఇటువంటి కలుషిత నీటి వనరులమీద ఆధారపడిన ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కోవలసి వస్తుంది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో ప్రజలు సరైన త్రాగునీరు దొరకక మినరల్ వాటర్ బాటిళ్ళపై ఆధారపడుతుండటం మనం గమనించవచ్చు.

ఈ పరిస్థితుల్లో 2001 జులై 26వ తేదీన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఒక ప్రశస్తమైన ఉత్తర్వునిచ్చింది. దీని ప్రకారం ఇప్పటి వరకూ ఇష్టానుసారంగా వ్యవసాయ భూముల్ని రొయ్యల చెరువులుగా మార్చుకుంటున్న వాళ్ళంతా ఇకమీదట దీనికోసం ప్రభుత్వ అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. అంతేగాకుండా వ్యవసాయం చేసుకునే హక్కు తప్ప మిగిలిన హక్కులన్నీ, అంటే- నీటికి సంబంధించిన హక్కులన్నీ ప్రభుత్వానికే చెంది ఉంటాయని హైకోర్టు ఆ ఉత్తర్వులో స్పష్టం చేసింది.

ఈ ఉత్తర్వులో ఇతర్ల భూములకు నష్టం వాటిల్లే విధంగా నీటిని కాలుష్యపూరితం చేయడం లాంటివి ఎవరూ చెయ్యరాదని కూడా సూచించబడింది. ఎవరూ కూడా తగిన అనుమతిలేకుండా చేపల/రొయ్యల చెరువులు తవ్వించే పనులు చేపట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవలసిందిగా కోర్టు ప్రభుత్వానికి సూచించింది. దీన్నిబట్టి ఇకనుంచి రొయ్యల చెరువుల సాగుదారులంతా ప్రభుత్వ అనుమతి తీసుకోవలసి ఉంటుంది.

రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో త్రాగునీరు సరిపడినంతగా లభ్యంకాకపోతున్న వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వం కొన్ని ప్రత్యేకమైన చర్యలను తీసుకోవాలని హైకోర్టు కోరింది. అంతేకాక 'నీరు-మీరు' కార్యక్రమంలో జలకాలుష్యాన్ని అరికట్టడానికి, త్రాగునీటి వినియోగాన్ని క్రమపర్చడానికి కూడా తగిన ప్రాధాన్యతను ఇవ్వమని సూచించింది. ముఖ్యంగా వ్యవసాయ భూములను రొయ్యల, చేపల చెరువులుగా మార్చడాన్ని క్రమబద్ధీకరించాలని కోరింది.

డెల్టా ప్రాంతాల మత్స్య పరిశ్రమలను జలవనరుల చట్టం 1974 క్రిందికి తీసుకురావాలి. అక్వా కల్చర్‌లో వినియోగిస్తున్న విద్యుత్‌కు పరిశ్రమలతో సమానంగా యూనిట్ ఛార్జీలను నిర్ణయించాలి. గ్రామంలో ఎంత భాగాన్ని చెరువులుగా మార్చడానికి అనుమతించాలనేది ఆ గ్రామరైతులతో చర్చించి నిర్ణయించాలి. చెరువుల్లో వినియోగించిన నీటిని కాలువల్లోకి మళ్లించే ముందు నిర్దేశించబడిన ప్రమాణాల ప్రకారం శుద్ధీకరించాలి.

('సమ్మతి' సౌజన్యంతో)

ఓ మతతత్వ పార్టీ మతతత్వ రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తుందనే వాస్తవ ఎజెండాను బిజెపి డాక్యుమెంట్ తేటతెల్లం చేసింది.

– సీతారాం ఏచూరి, (సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు)

పంట బాగానే పండింది. అయితే అది sustainableగా ఉండాలి. పోషకాహార భద్రత కలిగించాలి.

– ఎం.ఎస్. స్వామినాథన్

భారతదేశంలో ప్రతి నిమిషం ఒకరు క్షయ వ్యాధితో మరణిస్తున్నారు.

– 'హిందూ' సంపాదకీయం

చిన్న జాతీయ పార్టీలను, ప్రాంతీయ పార్టీలను నామమాత్రం చేసి దేశంలో రెండు పార్టీల వ్యవస్థ కోసం బిజెపి ప్రయత్నిస్తున్నది.

– హరికిషన్‌సింగ్ సూర్జిత్,
సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి

ప్రజాభీష్టానికి అనుగుణంగా పనిచేయని ప్రజాప్రతినిధుల్ని ప్రజలే పదవీచ్యుతుల్ని చేసేందుకు వీలుగా రీకాల్ విధానం ఉండాల్సిన అవసరం ఉన్నది.

– చంద్రబాబునాయుడు

నక్సల్స్ హింస ఒక సిద్ధాంతంకోసం...దాన్ని తప్పుబట్టే నైతికత ప్రస్తుత పార్టీల్లో ఉందా?

– జయప్రకాశ్ నారాయణ్

శుద్ధి చేయకుండా భూమిపై వదిలిన పారిశ్రామిక వ్యర్థ పదార్థాలు ప్రతీ ఏడాది యాభై నుంచి వంద లీటర్ల దాకా దామాషాలో లోతుకు ఇంకి క్రమంగా భూగర్భజలాలను కాలుష్యం చేస్తున్నాయి.

– జాతీయ భూకమత పరిశోధనా సంస్థ

తెలుగుదేశం పార్టీలో స్వార్థం పెరిగింది. అందువల్లనే నాయకులు తిరుగుబాట్లకు దిగుతున్నాడు.

– చంద్రబాబు నాయుడు

దేశంలో సమాచార సాంకేతిక రంగం కొంతమేర వెలుగుతున్నప్పటికి అది రాజీవ్‌గాంధి విత్తనాల ఫలమే

– శామ్ పిట్రోడా, (మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధికి ఐటి సలహాదారు)

వీక్షణంలో ప్రచురణ నిమిత్తం సమకాలిన రాజకీయార్థిక విషయాలపై విమర్శలను పంపించండి. వ్యాపార దృక్పథానికి దూరంగా ఉంటూ కేవలం పాఠకుల ఆదరణ, చందాదారులు, విరాళదాతల ప్రోత్సాహంతో వెలువడుతున్న ఈ ***వీక్షణం*** పక్షపత్రిక మీద మనందరిది. ఎప్పటికప్పుడు నాణ్యమైన రచనలతో సునిశితమైన విమర్శలతో ఉపయుక్తమైన సూచనల ద్వారా మరింతగా పత్రిక ఔన్నత్యానికి, ప్రగతికి తోడ్పడగలరని ఆశిస్తున్నాం – సం.

ప్రజాస్వామ్యం ఒక విలువ, ఒక సంస్కృతి

- ఎస్.వేణుగోపాల్

"ప్రజాస్వామ్యాన్ని" సజావుగా సాగించేందుకు తన ఓటుహక్కు వినియోగించుకోవలసిందేనని భావించే ఒక మిత్రుడు రెండు గంటలు క్యూలో నిలబడి విచిత్రమైన అనుభవంతో బైటికొచ్చాడు. ఆయన ఓటు అప్పటికే 'ఎవరో' వేసేశారు! మరో మిత్రుణ్ణి అవతలి పార్టీ ఏజెంటు 'నువ్వు నువ్వు' కాదు అని వెళ్ళగొట్టించాడు. మరోచోట పోలింగ్ బూత్ పక్కన పన్నెండు, పదమూడేళ్ళ పిల్లలు పోలింగ్ చీటీలు పట్టుకుని 'ఇది వేశాను, ఇది వేయాలి' అని తమవి కాని ఓట్లు ఒకటి కన్నా ఎక్కువ వేయడం చూశాను.

ఎన్నికల తంతు ప్రహసనం మాత్రమేనని, ఎన్నికలు న్యాయంగా, స్వచ్ఛంగా ఎక్కడా జరగడం లేదని చూపడానికి ఈ ఉదాహరణలు చాలు. ప్రజాస్వామ్యానికి అర్థం ఎన్నికలని చెప్పుకునే చోట ఎన్నికలిలా జరుగుతుంటే ప్రజాస్వామ్యం ఏమిటి? ఒక పాలనా పద్ధతిగా, ఒక నిర్మాణంగా ప్రచారమవుతున్న ప్రజాస్వామ్యం ఆదరణకన్న ఎక్కువ అవహేళననే పొందుతున్నది. అయితే ఈ దుస్థితికి కారణం ప్రజాస్వామ్యాన్ని ఒక పాలనా పద్ధతిగా మాత్రమే, నిర్మాణంగా మాత్రమే చూడడంలోనే, చూపడంలోనే ఉన్నది. ప్రజాస్వామ్యం విఫలమవుతున్నదని గుర్తించిన వెంటనే చాలా మంది, ముఖ్యంగా మధ్యతరగతికి చెందిన వాళ్ళు, నియంతృత్వాన్ని, సైనిక పాలనను కోరుకుంటూ ఉండడం మన అనుభవంలో ఉన్నదే. ప్రజాస్వామ్యాన్ని కేవలం ఒక నిర్మాణంగా చూడడం వల్ల అది విఫలమైన వెంటనే మరొక సమర్థమైన నిర్మాణాన్ని ఆశించడం సహజమే.

అయితే నిర్మాణంగా ప్రజాస్వామ్యం విఫలమైనప్పటికీ, దాని నిజమైన బలం దాన్నింకా బతికిస్తూనే ఉంది. కేవలం నిర్మాణంగా మాత్రమే చూసుకుంటే ప్రజాస్వామ్యం పేరు మీద ఇవాళ కొనసాగుతున్న వ్యవస్థలో ఉన్నంత దుర్మార్గం, దౌర్జన్యం, అవినీతి, అసహనం మరే నిర్మాణంలోనూ ఉండవు. ప్రజాస్వామ్యమనేది, ఆ మాటకొస్తే, ఎన్నడూ ప్రజలందరి స్వామ్యంగా లేదు. మాటగా అది పుట్టిన గ్రీకు నగర రాజ్యాలనాటి నుంచి సార్వత్రిక వయోజన ఓటు హక్కు వచ్చే దాకా ప్రజలలో చెప్పుకోదగిన భాగానికి ఆ స్వామ్యంలో ప్రాతినిధ్యం లేదు. వయోజన ఓటు హక్కు వచ్చిన తర్వాత కూడా జనాభాలో మూడోవంతు నుంచి పావువంతు దాకా ఉండే పౌరులకు పాలనలో భాగస్వామ్యం లేదు. (నేటి బాలలే రేపటి పౌరులు అనే ఆకర్షణీయ నినాదం కింద వాళ్ళకు మనం పౌరసత్వాన్నీ నిరాకరించాం! చిన్నారి పిల్లల భవిష్యత్తుకు అవసరమైన శాసనాలను మాత్రం మనమే చేస్తాం!)

ఒకవైపు ప్రజాస్వామ్యానికి అర్థాన్ని అంతకంతకూ ఎక్కువగా పరిమితం చేస్తూ, ప్రజాస్వామ్యమంటే ఎన్నికలు మాత్రమేనని భ్రమలు కల్పిస్తూ, ఆ ఎన్నికల విధానాన్ని మనం అపహాస్యం చేశాం. ప్రజలలో డెబ్బయి శాతం మందికే ఓటు హక్కు ఉంటుంది. ఆ డెబ్బై మందిలో యాభై మంది కన్నా ఎక్కువ ఓట్లు వేయరు. ఆ యాభై మంది ఓట్లను ఆశించేవాళ్ళు కనీసం ముగ్గురి నుంచి ఎంతమంది అయినా ఉండవచ్చు. వాటిలో మళ్ళీ దొంగోట్లు. సారాకూ, డబ్బుకూ కొనుక్కునే ఓట్లు ఉండవచ్చు. ఇదంతా లేకుండా సూటిగా, స్వచ్ఛంగా జరిగిన ఎన్నికలలోనయినా ఇరవై ఆరు మంది కోరుకుని, వోటిస్తే, ఆ అభ్యర్థి గెలిచే వందిమంది జీవితాలను శాసించే పాలకుడవుతాడు. ఇక ఇప్పుడున్న పద్ధతిలో పది ఓట్లు వచ్చిన అభ్యర్థి కూడా 'ప్రజాప్రతినిధి' అయిపోగలరు! ఈ దుస్థితిని అస్సాం ఎన్నికలు చాలా స్పష్టంగానూ, విషాదకరంగానూ 1983లో ప్రకటించే ఉన్నాయి.

నిజానికి ప్రజాస్వామ్యమంటే ఎన్నికలు మాత్రమే కాదు. ఒకానొక పాలనా పద్ధతి మాత్రమే కాదు. ఒకానొక నిర్మాణం మాత్రమే కాదు. ఎన్నికలు, పాలనా పద్ధతులు, నిర్మాణాలూ మానవ జీవితానికి, జీవిత సంక్షేమానికి అవసరమేగాని అవే సర్వస్వం కాదు. మానవ జీవన సౌందర్యాన్ని ఇనుమడింప జేసే విలువ ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్యం ఒక

> ప్రజాస్వామ్యమంటే ఎన్నికలు మాత్రమే కాదు. ఒకానొక పాలనా పద్ధతి మాత్రమే కాదు. ఒకానొక నిర్మాణం మాత్రమే కాదు. ఎన్నికలు, పాలనా పద్ధతులు, నిర్మాణాలూ మానవ జీవితానికి, జీవిత సంక్షేమానికి అవసరమేగాని అవే సర్వస్వం కాదు. మానవ జీవన సౌందర్యాన్ని ఇనుమడింప జేసే విలువ ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్యం ఒక సంస్కృతి అది ఒక సంప్రదాయం.

సంస్కృతి అది ఒక సంప్రదాయం. అది సామాజిక జీవనంలో ఉదాత్తతను హామీ ఇచ్చే సాధనం.

ప్రజాస్వామిక సంస్కృతికి ఎన్నికలలాంటి, ప్రభుత్వాలలాంటి సంకుచిత నిర్వచనాలు ఇవ్వడం కుటిలత్వం, ప్రజాస్వామిక సంస్కృతి తరతరాల మానవజాతి కన్నీళ్ళతో, చెమటతో, నెత్తురు ధారవోతలతో సాధించుకున్నది. రోమన్ నిరంకుశపాలన మీద స్పార్టకస్ బల్లెం ఎత్తిన వాడు ఆ బల్లెం కొనన పలికిన ప్రశ్న, పాలకులకు పాలితులకు వేరువేరు నీతులుంటాయా అనేదే. నాటి నుంచి నేటి దాకా ఈ వేరువేరు నీతుల సంప్రదాయాన్ని ధిక్కరించే సంప్రదాయం కొనసాగుతూనే ఉంది. ఎన్నెన్ని మైలు రాళ్ళనో దాటి వచ్చిన ఈ సంప్రదాయమే ప్రజల మధ్య సమానత్వాన్ని ఆకాంక్షించింది. సర్వతోముఖాభివృద్ధిని ఆకాంక్షించింది. ఈ ఆకాంక్షను పాలనా పద్ధతిగా అనువదించడం అవసరమే కావచ్చు గాని, అంతకన్నా ముఖ్యంగా ఇది మానవ స్వభావానికి వ్యక్తీకరణ అని గుర్తించాలి.

సంఘజీవిగా మనిషి స్వభావంలో తోటి మనుషులతో కలవవలసిన, మెలగవలసిన, సహకరించవలసిన, అభివృద్ధి చేయవలసిన ప్రవృత్తులు ఉండడమే, ఉన్నాయని గుర్తించడమే ప్రజాస్వామిక సంస్కృతిలో ప్రధానమైన అంశం. మానవులు తమ నిత్యజీవితావసర వస్తూత్పత్తిలో, సృజనాత్మక వ్యక్తీకరణలలో తోటి మానవులతో సంబంధాలలోకి వస్తారు. ఆ సంబంధాలు వేనవేల రూపాలలో వ్యక్తమవుతాయి. ఆ సంబంధాల ఉనికీ, అభివృద్ధీ, స్థిరత్వమూ సమాజపు మనుగడను పటిష్టం చేస్తాయి. వ్యక్తికీ సమాజానికీ మధ్య సాగే ఐక్యతలో, ఘర్షణలో ఈ సంబంధాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. ఈ సంబంధాల పట్ల మన దృక్పథం ఏమిటి, ఆ సంబంధాలను మనం ఎట్లా కలుపుకుంటాము. ఎట్లా నిలుపుకుంటాము, ఎట్లా పటిష్టం చేసుకుంటాము అనే ప్రశ్నలకు మన జవాబులే, మన ఆచరణల చూపే జవాబులే మనకు ప్రజాస్వామిక స్వభావం ఉన్నదా లేదా అనే విషయాన్ని తెలుపుతాయి.

సంఘజీవి కాకుండా మనిషికి మనుగడలేదు గనుక, ప్రజాస్వామిక స్వభావం మనిషికి దాదాపు సహజాతం లాగానే ఉంటుంది. అయితే సమాజంలో శైశవం నుంచి వృద్ధాప్యం దాకా మనుషులకు మనం ఇస్తున్న శిక్షణ, వ్యాప్తిలో వున్న భావజాలం ఈ సహజాతం మీద ముసుగులు కప్పుతున్నాయి. మనిషి సహజాతం ప్రజాస్వామిక స్వభావం కాదనీ, అంటే సంయమనం, సహకారం, సహజీవనం, అర్థం చేసుకునే, అభివృద్ధి చేసుకునే ప్రవృత్తులు మానవ సహజాతాలు కావని ప్రచారం జరుగుతోంది. స్వార్థం, దౌర్జన్యం, కౌటిల్యం, కార్పణ్యం మనిషిలో సహజ లక్షణాలనే అబద్ధ ప్రచారంతో మనుషులలో ఆ లక్షణాలనే ప్రవేశ పెట్టడం జరుగుతోంది.

సామాజిక పరిణామాల వల్ల, వ్యక్తిగత మానసిక దౌర్బల్యం వల్ల, మానసిక దౌర్బల్యానికే మరో రూపమైన అహంకారం వల్ల ఇవాళ మనుషులలో స్వార్థం, దౌర్జన్యం, కౌటిల్యం ఉన్న మాట నిజమే. అయితే వాటిని తొలగించగల శక్తి కూడా ప్రజాస్వామిక సంస్కృతే. మావో ఒకప్పుడు వ్యక్తిగత బాధ్యత గురించి రాస్తూ "ఉమ్మడి నిర్ణయం, వ్యక్తిగత మానసిక సౌలభ్యం" అన్నది ఈ సంస్కృతి గురించే.

ప్రజాస్వామ్యం పేరు మీద ఇవాళ ఊరేగుతున్న పోలింగు బూటకాలను, ఫాసిజపు నాటకాలను అర్థం చేసుకోవడం మాత్రమే కాదు, ప్రజాస్వామ్యం ఒక సంస్కృతి అని, ఒక విలువ అని గుర్తించడం కూడా జరిగినప్పుడే ప్రజాస్వామ్యం వికసిస్తుంది. విలువలను పరిరక్షించడం, ఉన్నతీకరించడం, జీవన సౌందర్యానికి తగిన విలువలను అభివృద్ధి చేయడం అవసరమని అంగీకరిస్తే ప్రజాస్వామ్యం మన హృదయగత ఆకాంక్ష అవుతుంది. మన రక్తనాళాల్లో మోగే నినాదమవుతుంది. చూపులకు అందే భవిష్యదుజ్వల స్వరూపం అవుతుంది. లేకపోతే పదవీకాంక్షగా, ఉన్మత్తత గొలిపే పానీయంగా, మిరుమిట్ల నడమంత్రపు సిరిగా మిగిలిపోక తప్పదు. ఇవాళ ప్రజాస్వామ్యం అక్కడే ఉన్నది.

(ఆంధ్రపత్రిక నవంబర్ 26, 1989 నుండి)

వీక్షణం చందాదారులు కాగోరువారు 'సమతా పబ్లికేషన్స్' పేర రూ. 140/-లను డి.డి.గా కింది అడ్రసుకు పంపించగలరు.

వి.హనుమంతరావు, ఇం.నెం. 8-3-898/22, రోడ్ నెం. 3, నాగార్జుననగర్, హైదరాబాద్ - 500 073.

Owned, Printed and Published by **V.Hanumantha Rao** at D.No. 8-3-898/22, Road No. 3, Nagarjuna Nagar, Hyderabad-500 073. Ph: 23748672

DTP at: AVM Graphics, Vidyanagar; Printed at: Nutan Art Printers, Lakdi-ka-pool, Hyderabad. **Editor**: V.Hanumantha Rao